హైదరాబాద్, బుధవారం 16-08-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 36 సంచిక : 335 పేజీలు : 8 వెల : 1 రూపాయి




### మన పథకాలు ఇతర రాష్ట్రాలకు

# ఆదర్శాలు

## పంద్రాగస్టు వేడుకల్లో సీఎం కేసీఆర్



హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సీఎం కేసీఆర్ గోల్కొండ కోటలో పోలీసుల గౌరవవందనం స్వీకరించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని సీఎం కేసీఆర్ వెల్లడించారు. తెలంగాణ పథకాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ వచ్చే యాసంగి



నుంచి రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ అందించేందుకు కృషి చేస్తున్నమని చెప్పారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచి నీళ్లందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ కల్లా మిషన్ భగీరథ నీళ్లు ఇంటింటికీ అందుతయన్నారు. కేజీ టూ పీజీ కోసం పెద్ద ఎత్తున గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. మూడేళ్లలోనే 552 గురుకుల పాఠశాలలను నిర్మించినమన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నం. ఒక్కో విద్యార్థి మీద లక్షా 25వేలు ఖర్చు చేస్తున్నం. కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేసేందుకు కృషి చేస్తున్నం. మంచి చేస్తుంటే విపక్షాలు అడ్డుపడుతున్నాయి. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయి. గర్భిణీల సంక్షేమం కోసం కేసీఆర్ కిట్‌లను అందిస్తున్నం.

రెండున్నర నెలల్లోనే 48 వేల మందికి కేసీఆర్ కిట్లు అందించినమని సీఎం వెల్లడించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. తెలంగాణలో శాంతి భద్రతలు మెరుగుపడ్డాయని సీఎం తెలిపారు. పేకాట, గుడుంబాను అరికట్టినం. షీ టీమ్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. మనల్ని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాల్లో షీ టీమ్స్ ఏర్పాటు చేస్తున్నాయి. పాలనా సౌలభ్యం కోసం కొత్తగా 21 జిల్లాల ఏర్పాటు చేసినం. హరితహారం విజయవంతంగా సాగుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో విద్రోహ పూరిత వ్యవహారం వల్ల గ్రామీణ జీవితం సంక్షోభంలో కూరుకు తరువాయి 2లో

### దేశాన్ని కొత్తపథంలో

# నడిపిస్తున్నాం

- మహనీయులను అందరూ స్మరించుకోవాలి
- దేశ యువత నిరాశ నిస్పృహలను వీడి ముందుకు నడవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ



దిల్లీ: దేశ స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో స్వాతంత్ర్య సమయంలో ప్రాణాలర్పించిన మహనీయులను అందరూ స్మరించుకోవాలని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దిల్లీలో ఎర్రకోటలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. రాముడు, కృష్ణుడు ఆదర్శ పురుషులు. ఆలమందను కాపాడేందుకు శ్రీకృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తాడు. పరిపాలన అంటే ఇలా ఉండాలి అని రాముడు ఆచరించి చూపాడు. 125 కోట్ల మంది భారతీయులందరం ఒక్కటై కొత్త సంకల్పంతో ఏదైనా సాధించగలం. 21వ శతాబ్దంలో జన్మించిన నవ యువకులకు ఈ జనవరి 1 కొత్త అవకాశాన్ని ఇస్తోంది. ఈ శతాబ్దిలో జన్మించిన యువత మొదటిసారి ఓటుహక్కు సాధించుకోబోతోంది. దేశ ప్రగతిని కొత్త దిశగా నడిపించే అవకాశం యువతకు వస్తోంది. దేశ యువత నిరాశ నిస్పృహలను వీడి మ ముందుకు నడవాలి. కొత్త సంకల్పంతో దూసుకుపోవాలి. అని ప్రధాని పిలుపునిచ్చారు.

ఈ దేశం నిజాయతీపరులది. ఇందులో అక్రమార్కులకు చోటు లేదు. బినామీ ఆస్తుల చట్టాన్ని తీసుకొచ్చి రూ.800కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నాం. సముద్రం, సరిహద్దు, సైబర్.. ఏ విషయంలోనైనా రాజీపడే ప్రసక్తే లేదు. జీఎస్టీని తీసుకొచ్చి సహకార వ్యవస్థకు జవసత్వాలు అందించాం. జీఎస్టీని ఇంత తక్కువ సమయంలో ఎలా అమలు చేశారని ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ దేశంలో నిబద్ధత, సాంకేతికతలో ఉన్న నైపుణ్యత జీఎస్టీని సుసాధ్యం చేసింది. దేశంలోని తరువాయి 2లో

## అమ్మ అడుగుజాడల్లోనే..

### తమిళనాడు సీఎం పళనిస్వామి



చెన్నై: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు తమిళనాడులో ఘనంగా నిర్వహించారు. తమిళనాడు సచివాలయ ప్రాంగణం సెయింట్ జార్జి కోట బురుజులపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెయింట్ జార్జికోట నుంచి మెరీనా బీచ్ వరకు సర్వాంగ సుందరంగా అలంకరించారు. సచివాలయంలో సీఎం పళనిస్వామికి రాష్ట్ర ప్రభుత్వ తరువాయి 2లో

## లయన్స్ సేవలను విస్తరించాలి

### ప్రపంచవ్యాప్త కార్యక్రమాల నిర్వహణకు 15 వేల డాలర్ల వితరణ



కాప్రా: సమాజంలో నిరుపేద అభ్యున్నతి, అంధత్వ నివారణ కోసం లయన్స్ సంస్థలు చేస్తున్న సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహారాష్ట్ర తరువాయి 2లో



## విరాట్ మరో రికార్డు..

భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి.. లంకేయులతో టెస్టు సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం ద్వారా విదేశాల్లో అత్యధిక టెస్టు విజయాలు సాధించిన రెండో భారత క్రికెట్ కెప్టెన్‌గా కోహ్లి నిలిచాడు. వార్త 8వ పేజీలో



## బెంగళూరులో భారీ వర్షం

### వర్షంలోనూ వెల్లువెత్తిన దేశభక్తి!



బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరును మంగళవారం ఉదయం భారీ వర్షాలు ముంచెత్తాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబైన నగర వీధులు భారీ వర్షానికి జలమయమయ్యాయి. ఉత్తరహళ్లి బస్‌స్టేషన్ సమీపంలోని ఇళ్లలోకి వరద నీరు చేరాయి. జేపీ నగర్, డాల్లర్స్ కాలనీ, కోరమంగళ తదితర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు చేరాయి. భారీ వర్షంతో పాటు తరువాయి 2లో

### టేకిట్ ఈజీ



పార్టీ పగ్గాలు ప్రియాంక చేతికిస్తారంటున్నారు...
ఇక్కడే ఉంటే మన ఫ్యూచర్ బాగుంటుందేమో ఆలోచించు !!

## కాళేశ్వరం ప్రాజెక్టుకు 96శాతం భూసేకరణ పూర్తి

### మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట : జిల్లా కేంద్రంలో స్వతంత్ర దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అభివృద్ధి పరంగా సిద్దిపేట జిల్లా అన్ని రంగాల్లో ముందున్నది. మిషన్ కాకతీయలో జిల్లాలో మొదటి, రెండో దశలో 34.3 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టిని తీశాం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో సిద్దిపేట అనంతగిరి రిజర్వాయర్‌కు 99 శాతం, రంగనాయక సాగర్‌కు 90 శాతం, కొమురవెల్లి మల్లన్న సాగర్‌కు 80శాతం, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణానికి 85శాతం భూసేకరణ పూర్తి తరువాయి 2లో



# మేఘమథనానికి సర్వం సిద్ధం



బెంగళూరు : మేఘ మథనం కోసం అమెరికా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన విమానాన్ని గ్రామీణాభివృద్ధి, పంచాయతి రాజ్ మంత్రి హెచ్.కె.పాటిల్ పరిశీలించి.. వివరాలు తెలుసుకున్నారు. జక్కూరు ఎయిర్ స్ట్రిప్‌లో నిలిపిన ఈ విమానం సాయంతోనే 18వ తేదీ నుంచి కృత్రిమ వర్షాలు కురిపించడానికి చర్యలు తీసుకుంటామని పాటిల్ తెలిపారు. మేఘ మథనానికి సంబంధించి అధికారులు హెచ్.పి.ప్రకాశ్, నాగాంబికాదేవి, ప్రకాశ కుమార్, అమెరికా నుంచి వచ్చిన నిపుణులతో సమావేశమయ్యారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడారు. మేఘ మథనానికి రూ.35 కోట్లను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఆకాశంలో మేఘాలు, తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను రాడార్ చిత్రాల ద్వారా గుర్తించి అక్కడ చినుకులు రాల్చడానికి చర్యలు తీసుకుంటా మన్నారు. సిల్వర్ అయోడ్కెడ్ లేదా సోడియం క్లోరైడ్‌లను చల్లటం ద్వారా మేఘాల్లోని తేమ నీటి చుక్కలుగా మారి వర్షం కురుస్తుందని ఆయన వివరించారు. ప్రపంచంలోని 45 దేశాల్లో గత నాలుగు దశకాలుగా మేఘ మథనాన్ని కొనసాగిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఎస్.ఎం.క ృష? ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో (2003) రూ.9 కోట్ల ఖర్చుతో 83 రోజుల పాటు మేఘ మథనాన్ని చేశామని గుర్తు చేశారు. ఆ తరువాత 2008లో గదగ్, హావేరి, ధార్వడ జిల్లాల్లో హులకోటి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ద్వారా మేఘ మథనాన్ని చేయించగా, ఆ ప్రాంతాల్లో 20 మి.మీ. నుంచి 45 మి.మీ. వర్షపాతం నమోదైందని తెలిపారు. కరా?టకలో వర్షాకాలంలో సగటున 1138 మి.మీ. వర్షపాతం నమోదవుతుందని, ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం లేనందున మేఘ మథనాన్ని చేయిస్తున్నామని వివరించారు.

## మానవ హక్కులపై సదస్సు



చెన్నై : మానవ హక్కులపై నగరంలో నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఎన్‌సీహెచ్‌ఆర్‌ఓ) సదస్సు నిర్వహించింది. అన్నాసాలైలోని ఉమాపతి హాల్‌లో 'కుల గుర్తింపు - మానవ హక్కులు'పై ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ రాష్ట్ర అధ్యక్షులు భవాని మోహన్ అధ్యక్షత వహించారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు మార్క్స్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కోశాధికారి షాజహాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ షేక్ అన్సారీ, ఎస్డీపీఐ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నిజాం మొహిదీన్, 'పుదియ కురళ్' వ్యవస్థాపకులు ఓవియా తదితరులు ప్రసంగించారు.

## చెరువులో పూడికతీత వేగవంతం

చెన్నై : తిరువొత్తియూరు చెరువు పూడికతీత పనుల్లో పలు స్వఛ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొంటున్నారు. 'ఫ్యూచర్ ఆఫ్ తమిళనాడు', 'ఐడియల్ ఛారిటబుల్ ట్రస్టు', స్థానికులతో కలిసి కొందరు కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది మార్చి నుంచి చెరువుల్లో పూడికతీత పనులు 24 వారాలుగా జరుగుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో 25వ వారాన్ని వేడుకగా నిర్వహించాలనుకుంటున్నామని, శుభ్రం చేసిన ప్రాంతంలో క్రికెట్ ఆడాలనుకుంటున్నట్లు వలంటీర్లు చెప్పారు. 30 మందికి పైగా యువకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫ్యూచర్ ఆఫ్ తమిళనాడు సంస్థకు చెందిన సంతోష్ మాట్లాడుతూ సీమ కరువెల మొక్కలను తొలగించామన్నారు. త్వరలో జేసీబీ యంత్రంతోనూ పూడిక తొలగిస్తామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే అధికారులతోనూ చర్చించామన్నారు. ఈ చెరువు రైల్వే పరిధిలోకి వస్తున్నందున వారి నుంచి కూడా సహకారం కోరుతున్నామని సంతోష్ వివరించారు. ఫ్యూచర్ సంస్థ సమన్వయకర్త ధనంజెళియన్ మాట్లాడుతూ చెరువులో పూడిక తీసి శుభ్రం చేయడం తమకెంతో ఆనందంగా ఉందని, కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహం పాల్గొంటున్నారన్నారు. ఈ నెల 27వ తేదీన మొక్కల పెంపకంపై తిరువొత్తియూరు ప్రాంతవాసులకు అవగాహన కల్పిస్తామన్నారు.

## అలరించిన 'ఎవరిగోల వారిదే'

ఖరగ్‌పూర్ : ఖరగ్‌పూర్ ఐఐటీ తెలుగు విద్యార్థుల ఏర్పాటుచేసిన ప్రస్థానం సంస్థ కాళిదాసు ఆడిటోరియంలో 'ఎవరి గోల వారిదే' హాస్య నాటికను ప్రదర్శించింది. 30 మంది విద్యార్థులు ఈ నాటికను ప్రదర్శించారు.విద్యార్థులు చక్కని ప్రద ర్శన ఇచ్చినందుకు ఐఐటీ తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు ఆచార్య ఎ.ఎన్.వి.సత్యన్నారాయణ, ఆచార్య జి.పి.రాజ శేఖర్, ఐఐటీ తెలుగు సాంస్కృతిక సంఘం పూర్వ అధ్యక్షుడు కె.వేణు గోపాల్‌లు ఈ సందరరేగా అభినందించారు.

## ప్రభుత్వ కళాశాల ప్రారంభం

చెన్నై : పొల్లాచ్చిలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలను మంత్రి వేలుమణి, ఉప సభాపతి పొల్లాచ్చి జయరామన్ ప్రారంభించారు. ఈ సందరరేగా మంత్రి మాట్లాడుతూ పొల్లాచ్చి ప్రజల చిరకాల కోరిక పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేశామన్నారు.

## నేల వేప రసం తాగిన వారికి
# బంగారం బహుమతి!

తిరునెల్వేలి : తిరునెల్వేలో మూడు రోజులు వరుసగా నేల వేప రసం తాగిన వారికి అన్నాడీఎంకే నిర్వాహకుడు బంగారాన్ని బహుమతిగా అందజేశారు. తిరునల్వేలి నగరంలో జ్వర ప్రభావం ఎక్కువగా ఉందని, దీని నుంచి ఉపశమనానికి ప్రజలు నేల వేప రసం తాగాలని, అలా తాగినవారికి బహుమతి ఇస్తామని అన్నాడీఎంకే ప్రముఖుడు, పండ్ల వ్యాపారి తంగదురై ప్రకటించారు. మూడు రోజులుగా ప్రజలకు నేల వేప రసం పంపిణీ చేశారు. రోజుకు అయిదుగురిని ఎంపికచేసి స్టీల్ బిందెలను బహుమతిగా ఇచ్చారు.కొక్కిరకుళం ప్రాంతం కొత్త అమ్మవారి వీధిలో మూడు రోజులు వరుసగా ఈ రసం తాగి ప్రథమ స్థానంలో నిలిచిన వారికి ఒక గ్రాము, ద్వితీయ స్థానం సాధించిన వారికి అరగ్రామ బంగారం, త ృతీయ స్థానంలో నిలిచిన వారికి పది గ్రాములు వెండి నాణేలను అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శి పాపులర్ మత్తయ్య ఆధ్వర్యంలో తంగదురై పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోహన్, మాదవరామానుజం, కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యం, హయాత్తు, కోమదినాథన్ తదితరులు పాల్గొన్నారు.

## భాజపా ఆధ్వర్యంలో 'తిరంగా యాత్ర'



బ్రహ్మపుర : భాజపా ఆధ్వర్యంలో 'తిరంగా యాత్ర' కన్నుల పండువగా నిర్వహించారు. ఆ పార్టీ గంజాం జిల్లా ఆధ్వర్యంలో స్థానిక గాంధీ నగర్ కూడలిలో ద్విచక్ర వాహనాలపై ఈ యాత్ర చేపట్టారు. నగరంలోని వివిధ రహదారుల మీదుగా సాగిన యాత్ర తిరిగి గాంధీనగర్ కూడలిలో ముగిసింది. రాత్రి ఇదే ఆవరణలో దేశభక్తి సంగీత విభావరి ఏర్పాటు చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు కన్హుచరణ పతి, ఇతర నాయకులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వందలాది మంది భాజపా నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై జాతీయ పతాకాలతో యాత్రలో పాల్గొన్నారు.

కటక్: భాజపా కటక్ జిల్లా, నగరశాఖలు ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. బక్షిబజార్ గోపబంధు భవన్ నుంచి యాత్ర ప్రారంభమై గౌరిశంకర్ పార్కు వద్ద ముగిసింది. భాజపా సీనియర్ నేతలు, మాజీ మంత్రులు బిశ్వభూషణ్ హరిచందన్, సమీర్ దే, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నయనకిశోర్ మహంతి, తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్: కొరాపుట్‌లో భాజపా కార్యకర్తలు త్రివర్ణ పతాకాలతో ర్యాలీలో పాల్గొని భారత మాతాకి జై నినాదాలతో హోరెత్తించారు. జిల్లా కేంద్రంలోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి దేశభక్తిని చాటారు. పట్టణ అధ్యక్షుడు సంజీవరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఖరగ్‌పూర్: పట్టణ భాజపా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దిలీప్ ఘోష్ నేతృత్వంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. గోల్‌బజార్ రామ మందిరం నుంచి మొదలైన ఈ ర్యాలీ మార్కెట్ మీదుగా ఇందా, కౌసల్యా, జపాటా పూర్, నింపురా మీదుగా సాగింది.

భాజపా కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అంజనాద్రి వద్ద డిసెంబరులో సంత్ సమాగమం

గంగావతి : తాలూకాలోని అంజనాద్రి పర్వతం వద్ద ఈ ఏడాది డిసెంబరు 9, 10 తేదీల్లో సంత్ సమాగమం నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు బసవరాజపాటిల్ సేడం తెలిపారు. ఆయన గంగావతిలో ఈ విషయమై విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ప్రముఖ సంత్‌లు, భక్తులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కిష్కింధకాండ, భగవద్గీత పారాయణం జరుగుతుందన్నారు.రూ.2.5 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.

# ఏకతాటిపై నీటి కేక



బెంగళూరు : మహదాయి నదీ జలాల సమస్యను పరిష్కరించుకునేందుకు గోవా ప్రభుత్వంతో చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టీకరించారు. చట్టసభలకు ఎన్నికైన రెండు రాష్ట్రాల ప్రతినిధులు సానుకూల వాతావరణంలో చర్చించుకుంటే సమస్య ఒక కొలిక్కి వస్తుందని అభిప్రాయ పడ్డారు. కళసా-బండూరి పథకం, మహదాయి నదీ జలాల మళ్లింపు, రాష్ట్ర విపత్తు పరిహార నిధి పంపిణీలకు సంబంధించి విధానసౌధలో సోమవారం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు సూచించిన రీతిలో గోవా ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కరించుకునేందుకు తమకు ఎటువంటి అభ్యంతర్చా లేవన్నారు. కొద్ది రోజుల కిందట హుబ్బళ్లికి వెళ్లిన సమయంలో అక్కడి రైతులు సమస్యను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. వారు రెండేళ్లుగా పోరాటం చేస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నానని తెలిపారు. సమస్య పరిష్కారానికి అనువుగా సభను నిర్వహించాలని కోరుతూ గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాస్తానని చెప్పారు. గతంలో ఇదే సమస్యను చర్చించేందుకు గోవా ప్రభుత్వానికి లేఖ రాయగా స్పందన రాలేదని, అక్కడి ముఖ్యమంత్రికి ఫోన్ చేసినా స్పందించలేదని ఆక్రోశించారు. గోవాలో ఉప ఎన్నికల ప్రక్రియ ఉందని, ఆ తరువాత సమావేశాన్ని నిర్వహిద్దామని అక్కడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తమకు తెలిపారని చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించే బాధ్యతను తలకెత్తుకుంటామని కేంద్ర మంత్రి సదానందగౌడ, ప్రతిపక్ష నాయకుడు ఈశ్వరప్ప సభలో హామీ ఇచ్చారు. మంత్రులు ఎం.బి.పాటిల్, హెచ్.కె.పాటిల్, టి.బి.జయచంద్ర, కృష్ణ, రమేష్ జారకిహొళి, వినయ్ కులకర్ణి, ఉమాశ్రీ, మాజీ మంత్రి హెచ్.డి.రేవణ్ణ, కేంద్ర మంత్రి రమేష్ జిగజిగణి, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మండ్య జిల్లా రైతులు ఈ ఏడాది వర్షాధార పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది కూడా వర్షాభావ పరిస్థితి నెలకొని ఉన్న నేపథ్యంలో తమకు సహకరించాలని కోరారు. ఇప్పటికే పంట కాలువలకు నీటిని విడుదల చేసినప్పటికీ, దానిపై పూర్తిగా ఆధారపడవద్దని సూచించారు. వాటిని తాగునీటికి, పశువుల కోసం వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూన్, జులైలలో తమిళనాడుకు 44 టీఎంసీల నీటిని విడుదల చేయవలసి ఉండగా, నీటి కొరతతో తమిళనాడుకు నీటిని విడుదల చేయలేదని సభలో పాల్గొన్న మంత్రి ఎం.బి.పాటిల్ తెలిపారు. కావేరి జలానయన ప్రాంతంలోని చెరువులను నింపే బాధ్యతను తక్షణమే చేపట్టాలని ఎమ్మెల్యే సా.రా.మహేశ్ సూచించారు. దీనికి సంబంధించి మంత్రులు ఇచ్చిన ఆదేశాలను అధికారులు పాటించలేదని, మరోమారు దాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్ర కుంటియా తదితరులూ మాట్లాడారు.

మొదటి పేజీ తరువాయి

## అమ్మ అడుగుజాడల్లోనే..

ప్రధాన కార్యదర్శి గిరిజా వె%ద్యనాథన్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం పతాకావిష్కరణ చేసి ప్రాంతీయ త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి జయలలిత అడుగుజాడల్లోనే తమ ప్రభుత్వం నడుస్తోందన్నారు. అమ్మ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## దేశాన్ని కొత్తపథంలో నడిపిస్తున్నాం

నలుమూలలకు విద్యుత్ వెలుగులు ప్రసరిస్తున్నాయి. ఇంటింటికీ గ్యాస్ పొయ్యిల ద్వారా కోట్లాది పేద మహిళలకు పొగ నుంచి విముక్తి కలిగించాం. ప్రభుత్వ వ్యవహారాలను సులభతరం చేసే కార్యక్రమంలో వేగం పుంజుకున్నాం. ప్రభుత్వ నిబంధనల బంధనాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించే ప్రయత్నం కొనసాగుతోంది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఓఆర్‌ఓపీని అమల్లోకి తెచ్చాం. జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో కలిసి అక్కడి ప్రజల రక్షణకు కట్టుబడి ఉన్నాం. కశ్మీర్ అభివృద్ధి, ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ దేశం కట్టుబడి ఉంది. కొన్ని సమస్యలు ఆరోపణలు, తుపాకులతో పరిష్కారం కావు. ప్రజలు ఒకరికొకరు మమేకమైనప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రజలంతా భుజం భుజం కలిపినప్పుడే శత్రువును సమర్థంగా ఎదుర్కోగలం.

దేశంలో వేగవంతమైన చర్యలకు శ్రీకారం చుడుతున్నాం. 9 నెలల్లో శుక్రగ్రహానికి చేరినవాళ్లం.. 70 కిలోమీటర్ల రైల్వేలైన్ వేయడానికి 42ఏళ్లు పట్టింది. ఇలాంటి పరిస్థితులు మార్చాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రాలకు మరింత ఆర్థిక సౌలభ్యాన్ని కల్పించి వేగవంతమైన అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఉదయ్ పథకం ద్వారా రాష్ట్రాలకు జవసత్వాలు చేకూర్చాం. అప్పుల్లో మునిగి ఉన్న విద్యుత్ ఉత్పాదక సంస్థలకు కొత్త వూపిరి అందించాం. అభివృద్ధి పథంలో ముందుకెళ్దామంటే ప్రజలెప్పుడూ వెనకడుగు వేయరు. గ్యాస్ రాయితీ వదులుకోమన్నా.. నోట్ల రద్దు చేసినా జనం అండగా నిలిచారు. జీఎస్టీ వంటి బృహత్తర కార్యక్రమానికి ప్రజలు వెన్నంటి నిలిచారు. రైతులకు సాగునీరు ఇస్తే బంగారం పండిస్తారు. ప్రధానమంత్రి కృషి యోజన ద్వారా రైతులకు సాగు నీరందించే కార్యక్రమం వేగవంతం చేస్తున్నాం. మార్కెట్ వ్యవస్థలో లోపాలను సరిదిద్దేందుకు కొత్త విధానాలతో ముందుకొస్తున్నాం నష్టాల్లో ఉన్న అన్నదాతలను వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్నాం. అప్పుల్లో కూరుకుపోయిన రైతన్నకు చేయి అందించే కార్యక్రమం ప్రభుత్వం చేస్తోంది. యువత ఆర్థిక సాయమందిస్తే ఉద్యోగం కోసం ఎదురుచూడరు.. కొత్త ఉద్యోగాలు సృష్టిస్తారు. ముద్ర యోజన ద్వారా అనేక మంది యువత కొత్త ఉద్యోగాలు సృష్టించారు. అని మోదీ పేర్కొన్నారు.

ట్రిపుల్ తలాక్‌పై దేశం మొత్తం ఆందోళన చెందింది. ఈ విధానం ద్వారా ఎందరో ముస్లిం మహిళలు నిరాశ్రయులయ్యేవారు. దీనిపై కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ప్రజలందరూ అండగా నిలిచారు. ఈ దేశంలో మత విశ్వాసాల పేరుతో ఎలాంటి ఆందోళనలకు చోటులేదు. దేశంలో ఉన్న ప్రతి పౌరుడు సంపూర్ణ హక్కులతో జీవించే అవకాశం ఉంది అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## బెంగళూరులో భారీ వర్షం

ఈదురుగాలులు రావడంతో రోడ్లపై భారీ చెట్లు నేలకొరిగాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్లు సగానికి సగం వరద నీటిలో మునిగాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని బీబీఎంపీ(బృహత్ బెంగళూరు మహానగర పాలిక్) పిలుపునిచ్చింది.

ఒకవైపు విషాదం.. మరోవైపు జాతీయతాస్ఫూర్తి.. వరదలు ముంచెత్తిన అసోంలో ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యమిది. భారీ వరదలు అసోంను అతలాకుతలం చేసినా.. ఆ రాష్ట్రంలో స్వాత్రంత్య దినోత్సవ స్ఫూర్తి చెక్కుచెదరలేదు. చుట్టూ మూగిన నీళ్లలోనూ, పుట్టెడు కష్టాల్లోనూ వీలున్న చోట జాతీయజెండాలు ఎగురవేసి అసోం ప్రజలు తమ దేశభక్తిని చాటుకుంటున్నారు.

పెద్ద ఎత్తున వరదనీళ్లు మూగిన ఓ స్కూల్ ఎదుట చిన్నారులు పీకల్లోతు నీళ్లలో నిలబడి జెండాకు సెల్యూట్ చేస్తున్న ఫొటోను నెటిజన్లను కదిలిస్తున్నది. వరదల్లోనూ వెనుకంజ వేయకుండా వినూత్నరీతిలో జెండాపండుగ చేసుకున్న అసోం వాసులు ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఒకరు ఇంటిపైకప్పు మీద జెండా ఎగురవేస్తే.. మరికొన్నిచోట్ల పడవలో నిలబడే ప్రజలకు మువ్వన్నెల జెండాలను ఆవిష్కరించారు. పుట్టెడు దుఃఖంలోనూ జాతీయతాస్ఫూర్తి కొరవడలేదని చాటుతున్నారు.

## మన పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శాలు

పోయిందన్నారు. మిషన్ కాకతీయతో చెరువుల్లో నీటి సామర్థ్యం పెరిగిందని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వం సహకారం అందిస్తే రైతులు మట్టిలో బంగారం పండిస్తరు. ప్రభుత్వం నీటి పారుదల రంగానికి రూ.25 వేల కోట్లు కేటాయించింది. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. నదీ జలాల్లో మన వాటాను పూర్తిగా వాడుకునేందుకే ప్రాజెక్టులు, శ్రీరాంసాగర్ పనులకు శ్రీకారం చుట్టినట్లు సీఎం వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణాలు మాఫీ చేశాం. తెలంగాణలో 22.5 టన్నుల విలువ సామర్థ్యం గల గోడౌన్లు ఉన్నాయని సీఎం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం తెలిపారు.

**నిరుద్యోగ యువతకు శుభవార్త..**

పవిత్ర స్వాతంత్ర్య దినోత్సవం రోజున నిరుద్యోగ యువతకు సీఎం శుభవార్త అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ఆవిర్భవిస్తే లక్ష ఉద్యోగాలు సిద్ధిస్తాయని ఉద్యమంలో చెప్పా. ప్రభుత్వం లక్షా 12 వేల 536 ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. ఇప్పటివరకు 27,660 ఉద్యోగాలకు నియామక ప్రక్రియ చేపట్టాం. త్వరలో మరో 84,877 ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపడతాం. వచ్చే ఏడాది ఏర్పడే ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ ఏడాదే నియామకం చేపట్టాలని ఆదేశాలు జారీచేసినట్లు సీఎం వెల్లడించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుకు 96శాతం భూసేకరణ పూర్తి

చేశాం. మాభూమి, మాపంట రైతు సమగ్ర సర్వే ద్వారా జిల్లాలో 2,12,070 మంది రైతుల పూర్తి వివరాలు సేకరించాం. సమాచారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నాం.

సిద్దిపేట పాత మార్కెట్‌లో రూ.10 కోట్లతో సమీకృత మోడల్ మార్కెట్, రూ.10 కోట్లతో గజ్వేల్‌లో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మిస్తున్నాం. జిల్లాలో ప్రయోగాత్మకంగా రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం. రోజుకు 20 లక్షల యూనిట్ల అధిక కరెంటు వినియోగం పెరిగింది. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడం ఇక్కడి ప్రజల, విద్యార్థులకు ఒక వరం. రూ.20 కోట్లతో సిద్దిపేటలో 300 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం సిద్దిపేటకు వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేసుకున్నాం.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధికంగా చేపట్టాం. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచాం. సిద్దిపేటలో 2వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లను దసరా నాటికి పూర్తి చేసి లబ్దిదారులకు అందజేస్తామని తెలిపారు.

## లయన్స్ సేవలను విస్తరించాలి

అదనపు డీజీపీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. కాప్రాలోని సాకేత్ టౌన్‌షిప్‌లోని లక్ష్మారెడ్డి గార్డెన్స్‌లో సింహ శతాబ్ది పేరున అంత్జాతీయ లయన్స్‌క్లబ్ జిల్లా 320సి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాభాపేక్ష లేకుండా సమాజ సేవ కోసం తమ విలువైన సమయాన్ని, డబ్బును వెచ్చిస్తున్న లయన్స్ సభ్యుల సేవలను ఆయన అభినందించారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా 320సి డిస్ట్రిక్ట్ గవర్నర్ బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ 1వ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా జీఎస్ ప్రహ్లాద్, 2వ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా పి.రవీంద్రనాథ్‌గుప్తా, లయన్స్ జిల్లా కార్యవర్గాలు ప్రమాణస్వీకారం చేశాయి. మాజీ అంతర్జాతీయ లయన్స్ క్లబ్ డైరెక్టర్ సభ్యులు వినోద్‌ఖన్నా సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ ద్వారా చేసే ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణ కోసం 15 వేల డాలర్లను లయన్స్ సభ్యులు విరాళంగా ఇచ్చినట్లు గవర్నర్ బి.వెంకటేశ్వవరావు వెల్లడించారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ జిల్లా గవర్నర్లు, ఈసీఐఎల్ ఎలైట్ క్లబ్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, మూర్తి, గోపాలరావు, కొత్తరామారావు, మనోహర్‌రాజు, హేమాద్రి, అశోక్, నందా శ్రీనివాస్, ఏవీఆర్ దత్తూ, 48 క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# సమాజానికి దీప స్తంభం 'ఉప్పల'

- 'వృాదారంగు కలలు'
- కవితా సంపుటి ఆవిష్కరణ

బ్రహ్మపుర : ఉప్పల లక్ష్మణరావు మహా పండితుడని, ఆయన ఓ సాహిత్య నిర్మాత అని, స్త్రీ, పురుషుల సంబంధం ఎలా ఉండాలి? ఉమ్మడి లక్ష్యం కోసం ఒక స్త్రీ, పురుషుడు ఎలా జీవించాలన్నది ఆయన, ఆయన భార్య మెల్లీ షోలింగర్‌లు ఒక ఉదాహరణ అని ప్రముఖ సాహితీవేత్త వాడ్రేవు చినవీరభద్రుడు (హైదరాబాదు) అన్నారు. స్థానిక సాహితీ సంస్థ 'వికాసం' ఆధ్వర్యంలో ఉప్పల లక్ష్మణరావు 119వ జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం ఆవరణలో జరిగిన కార్యక్రమానికి హాజరైన చినవీరభద్రుడు స్మారకోపన్యాసం చేశారు. ఉప్పల సమాజానికి ఒక దీపస్తంభం, దిక్సూచి వంటివారని చెప్పారు. వారి గురించి విద్యార్థు లకు ఒక పాఠ్యాంశంగా ఉండాలని ఆయన అన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## ఉత్తమ ఉద్యోగులుగా జిల్లా నుంచి నలుగురు ఎంపిక

మహబూబ్‌నగర్ : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు వివిధ కేటగిరీల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్టీ నంబరు 1747ను విడుదల చేసింది.

కేటగిరీ గ్రూప్-1లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ మిషన్ భగీరథ మహబూబ్‌నగర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బల్‌రాంశ్రీనివాస్, గ్రూప్-2 కేటగిరీలో నారాయణపేట తహశీల్దారు బి.పార్థసారథి, గ్రూప్-3లో గండీడ్ మండలం మహమ్మదాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్‌నర్సు ఎం.జయమ్మ, గ్రూప్-4లో నారాయణపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ సహాయకుడు ఎన్.శ్రీశైలం ఎంపికయ్యారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో వీరు చేసిన సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి వీరు పురస్కారాలు అందుకోనున్నారు.

## కృష్ణాష్టమి సందర్భంగా ఒకేసారి వెయ్యి మంది సామూహిక కోలాటం

### వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన చిన్నారులు



మహబూబ్‌నగర్ : చిట్టి గోపమ్మలు.. చిన్ని కృష్ణయ్యలు తమ కోలాటంతో అలరించారు.. నేలపై హరివిల్లు విరిసిందా అన్నట్లు రంగురంగుల దుస్తుల్లో చమక్కుమన్నారు.. ఒకేసారి వేయి మంది లయబద్ధంగా కోలలు వేస్తూ ఆకట్టుకున్నారు.. ఇందుకు మహబూబ్‌నగర్‌లోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుక వేదికయింది.. ఈ సామూహిక నృత్యం వండర్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైంది.. 6 నిమిషాల 42 సెకండ్ల పాటు ఒకేసారి వేయి మంది చిన్నారులు కోలాటంతో అలరించి వండర్ బుక్‌ఆఫ్ రికార్డును సొంతం చేసుకున్నారు. వండర్ బుక్‌ఆఫ్ రికార్డు ప్రతినిధులు బింగి నరేందర్‌గౌడ్, స్వర్ణశ్రీలు మహబూబ్‌నగర్ గ్రామర్‌స్కూల్ యాజమాన్యానికి ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా చిన్నారులు ఒకేసారి కోలాటం నృత్యంతో ఆకట్టుకున్నారని అన్నారు. జిల్లాకు ఇది రెండో వండర్ బుక్‌ఆఫ్ రికార్డు అని గుర్తు చేశారు. బాల కళాకారుల కృషి వెనక గురువులు, తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందని, చిన్నారుల విజయం పాలమూరు పట్టణానికి గర్వకారణమని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల ప్రతిభ ఎనలేనిదని అభినందించారు. చదువుతో పాటు ఇలాంటి సాంస్కృతిక అంశాల్లో రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. వండర్ బుక్‌ఆఫ్ రికార్డు సాధించిన చిన్నారులు, పాఠశాల యాజమాన్యం, నృత్య శిక్షకురాలు విజయలక్ష్మిని ఎమ్మెల్యే అభినందించారు. పురపాలక ఛైర్‌పర్సన్ రాధ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సి.రాజేశ్వర్, గ్రామర్ స్కూల్ ఛైర్మన్ బెక్కరి రాంరెడ్డి, లయన్ ఎ.నటరాజ్, ప్రిన్సిపల్ శాంత, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్, వెంకటయ్య, సునీత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసు అధికారులు

మహబూబ్‌నగర్ : చక్కటి పనితీరు కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ప్రశంస పత్రాలు అందించనున్నారు. ఈ మేరకు జాబితాను ఎస్పీ రెమా రాజేశ్వరి సోమవారం విడుదల చేశారు. సీఐలు రవీందర్‌రెడ్డి (డీటీసీ), రామకృష్ణ (మహబూబ్‌నగర్ గ్రామీణం), లక్ష్మయ్య (పీసీఆర్) ఎస్‌ఐలు శ్రీనివాస్ (అడ్డాకుల), శ్రీకాంత్‌రెడ్డి (కోయిలకొండ), విజయ్‌కుమార్ (ఫూట్కూర్), వెంకటేశ్వర్లు (మక్తల్), ఏఎస్‌ఐలు దేశ్యానాయక్, కిష్ట్యానాయక్, హెడ్‌కానిస్టేబుళ్లు ఆంజనేయులు, ఆరీఫ్‌నవాజ్, కానిస్టేబుళ్లు అంజిలప్ప, కేశవులుగౌడ్, నరేందర్‌గౌడ్, అబ్దుల్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు రాజశేఖర్, సలీమ్, కానిస్టేబుల్ ఇంతియాజ్‌హుస్సేన్, హోంగార్డులు సలీం, యాదమ్మ ఎంపికయ్యారు. వీరికి రాష్ట్ర మంత్రి డా.లక్ష్మారెడ్డి ప్రశంసపత్రాలను అందజేయనున్నారు.

## రుబెల్లా వ్యాక్సినేషన్ వివరాల నమోదులో పొరపాట్లు చేయొద్దు




మహబూబ్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెడుతున్న రుబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమంలో వివరాల నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.రజని కోరారు. జిల్లాలోని డాటా ఎంట్రీ ఆపరేటర్లు, రిపోర్టింగ్ సిబ్బందితో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఏ రోజు వ్యాక్సిన్ ఇచ్చిన చిన్నారుల వివరాలు ఆ రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. వివరాల నమోదు పక్కగా ఉండాలని, ఏ మాత్రం పొరపాటు చేసిన పిల్లలకు నష్టం కలుగుతుందని తెలిపారు. టీకాలు వేసిన వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. వాటి ద్వారా సైతం వైద్యాధికారులు వివరాలు నమోదు చేసేందుకు అవకాశం ఉందని చెప్పారు. మాస్ మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రుబెల్లా వ్యాక్సిన్‌పై విస్తృతంగా అవగాహన కలిగించే కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. చాలా మందికి దీనిపై అపోహలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందిపై ఉందని చెప్పారు. రుబెల్లాకు సంబంధించిన ప్రచార సామాగ్రిని క్షేత్రస్థాయిలోకి పంపించడం జరిగిందని, దానిని విస్తృతంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో హెల్త్‌ఎడ్యుకేటర్ నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా బృందం పంద్రాగస్టుకు ముస్తాబు

భువనగిరి : స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లాకేంద్రమైన భువనగిరిలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ తోరణాలతో అలంకరించారు. జెండా దిమ్మెలు, జెండా పైపులను త్రివర్ణాలు వేయడంతోపాటు తోరణాలు కట్టారు. పంద్రాగస్టు సామగ్రి విక్రయానికి ప్రత్యేకంగా దుకాణాలను ఏర్పాటు చేశారు. దుకాణాలన్నీ కొనుగోళ్లతో రద్దీగా ఉన్నాయి. నూతన డిజైన్లలో బ్యాడ్జీలు, కండువాలు, శాలువాలు, కంకణాలు మార్కెట్‌లోకి వచ్చాయి. యువకులు వాహనాలపై త్రివర్ణ పతాకాలను అమర్చుకుని దేశభక్తిని చాటుకున్నారు. యువజన, స్వచ్ఛంద సంఘాలు, ప్రైవేట్ సంస్థలు స్వాతంత్ర్య దిన వేడుకలకు సన్నాహాలు చేస్తున్నాయి. పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భువనగిరి ఖిల్లాపై జెండా ఎగురవేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## బీఈడీ ప్రథమ సంవత్సర సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ : పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ ప్రథమ సంవత్సర ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్) ఫలితాలను పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాజారత్నం, రిజిస్ట్రార్ ఐ.పాండురంగారెడ్డిలు విడుదల చేశారు. పరీక్షకు 1,388 మంది విద్యార్థులు హాజరు కాగా 704 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 679 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేదు. అయిదుగురు విద్యార్థులు పరీక్ష సమయంలో చూచిరాతకు పాల్పడుతూ పట్టుబడ్డారు. పరీక్షల పునర్ మూల్యాంకనానికి విద్యార్థులు ఈ నెల 28లోగా సంబంధిత కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫలితాలతో పాటు దరఖాస్తులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

## ప్రశ్నే ప్రజల ఆయుధం కావాలి



శివాజీనగర్ : ప్రశ్నే ఎన్నో అంతరాలను, సామాజిక అంశాలను వెలికితీసిందని, ప్రశ్నే ప్రజల ఆయుధం కావాలని చాటి చెప్పిన వ్యక్తి డాక్టర్ పీఎం భార్గవ అని జన విజ్ఞాన వేదిక జాతీయ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ రావు అన్నారు. కోటగల్లీలోని జంపాల చంద్రశేఖర ప్రసాద్ ట్రస్టు గ్రంథాలయంలో ఆకుల పాపయ్య అధ్యక్షతన ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ పీఎం భార్గవ, డాక్టర్ యశ్‌పాల్, డాక్టర్ వి.ఆర్.రావుల సంస్మరణ సభను చేపట్టారు. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలను వ్యతిరేకించి ప్రచారం చేసిన మేథావి భార్గవ న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులం, మతం పేరుతో విభజించి పాలిస్తున్నాయని, మూఢనమ్మకా లను, మతతత్వాన్ని పెంచి పోషిస్తుందన్నారు. తమను తాము చంపుకొనే స్థితికి మూఢ నమ్మకాలు దిగజారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు మాట్లాడుతూ. .సైన్సును సమాజానికి అనుసంధానం చేయడంలో ముగ్గురు శాస్త్రవేత్తలు కృషి చేశారని తెలిపారు. పెట్టుబడిదారుడి దగ్గర నైపుణ్యం కలిగిన పరిశోధకులు కార్మికులుగా మారారన్నారు. సైన్సుకు, శాస్త్రవేత్తలకు స్వేచ్ఛ కావాలన్నారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్రకార్యదర్శి సంగం, భూమయ్య, నర్సయ్య, గంగాధర్, శ్రీధర్, గంగాధర్, అరుణ, అనంత, స్వప్న, మురళి, రవి, శివకుమార్, అన్వేష్, మహేందర్, సౌందర్య, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులపై దాడులను అరికట్టాలి




మహబూబ్‌నగర్ : ప్రైవేట్ ఆస్పత్రులు, వైద్యులపై దాడులను అరికట్టాలని వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డా.రాంమోహన్ డిమాండ్ చేశారు. నవోదయ ఆస్పత్రి, వైద్యులపై జరిగిన దాడికి నిరసనగా మహబూబ్ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. వైద్యులెవరూ రోగులను చంపాలనే ఆలోచనతో వైద్యం చేయరని అన్నారు. ప్రతి ఒక్కరినీ బతికించాలనే ఆలోచనతోనే వైద్య సేవలు చేస్తామని చెప్పారు. నవోదయ ఆస్పత్రిలో సైతం సోను అనే మహిళ సీరియస్ పరిస్థితుల్లో ఆస్పత్రికి తీసుకువచ్చారని అన్నారు. ఆ సమయంలో నిపుణుల బృందం అవసరం అయిన పరీక్షలు చేస్తున్న క్రమంలోనే ఆమె మృతి చెందిందని చెప్పారు. వైద్యులు దగ్గరుండి పరీక్షలు చేస్తుండగా వైద్యుల నిర్లక్ష్యం ఉందని మాట్లాడటం సరికాదని అన్నారు. దాడి చేసిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కఠిన చట్టాలను తీసుకువచ్చి వైద్యులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. వైద్యులపై ఇలా దాడులు చేస్తే భవిష్యత్తులో సీరియస్ ఉన్న రోగులకు వైద్య సేవలు అందించడం కష్టం అవుతుందని చెప్పారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహం నుంచి ప్రారంభం అయిన ర్యాలీ తెలంగాణ కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో వైద్యుల సంఘం సభ్యులు డా.సంపత్, డా.విష్ణుజనార్ధన్, డా.రమేష్‌సరోడే, డా.శామ్యూల్, డా.శ్రీధర్‌రెడ్డి, డా.మధుసూదన్‌రెడ్డి, డా.చంద్రముఖి, డా.కవితారెడ్డి, డా.సునీతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని విస్మరించిన కేసీఆర్

### భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగం



మహబూబ్‌నగర్ : పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై శాసనసభ సాక్షిగా ఇచ్చిన హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించారని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. కరవు జిల్లాపై వివక్ష చూపడమేంటని ఆయన ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో భాజపా కార్యాలయంలో నాగం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు ఎత్తిపోతల్లో భాగంగా రోజుకు 3 టీఎంసీల నీటిని కేటాయించాలని మొదట్లో నిర్ధరించారని, దానిని మార్పు చేస్తూ 2 టీఎంసీలకు కుదించారని అన్నారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల నిర్లక్ష్యంతో నేడు 2 టీఎంసీలలో కూడా అర టీఎంసీ నీటిని నార్లాపూర్ రిజర్వాయరు నుంచి డిండికి తరలించేందుకు నిర్ణయించారని అన్నారు. డిండికి నీరు తీసుకెళ్లటం ద్వారా జిల్లాకు ఎలాంటి నష్టం లేదని పేర్కొనడం మంత్రి జూపల్లి కృష్ణారావు అవగాహన రాహిత్యమన్నారు. డిండికి కాలువను తవ్వడం వల్ల కల్వకుర్తి ఆయకట్టుకు ప్రమాదం పొంచి ఉన్నదని పేర్కొన్నారు. కల్వకుర్తి ప్రాజెక్టు సామర్థ్యాన్ని అప్పట్లోనే జూపల్లి కృష్ణారావు 9 మీటర్ల నుంచి 6 మీటర్లకు తగ్గించి ద్రోహం చేశారని మండిపడ్డారు. రైతులకు భూమి నష్టపరిహారం చెల్లించటంలో కూడ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. తెరాసా పాలకులకు రైతులే తగిన బుద్ధిచెబుతారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు ఉమ్మడి జిల్లాపై వివక్ష చూపుతున్నారని వాపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 5,700 కోట్ల ఖర్చు చేసి డిసెంబరు నాటికి నీటిని ఇవ్వాలని, లేకుంటే అధికారుల భరతం పడతామని హెచ్చరిస్తున్నారని, అదే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ల నిర్మాణానికి ఈ ఏడాది కేవలం రూ.370 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ప్రాజెక్టుల విషయంలో జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై ముఖ్యమంత్రిని అడిగే దమ్ము, ధైర్యం జిల్లా మంత్రులు, తెరాసా ఎమ్మెల్యేలకు లేదని విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో అవినీతిని ప్రశ్నిస్తే అడ్డుకుంటున్నారని తనపై అంభాండం మోపుతున్నారని వాపోయారు.

మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, వికారాబాదు జిల్లాల భాజపా ముఖ్యనేతల సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో చోటుచేసుకున్న అవినీతిని అదేరోజు బయటపెడతానని అన్నారు. ప్రాజెక్టుల పరిరక్షణకు భాజపా భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు. భాజపా జిల్లా అధ్యక్షురాలు పద్మజారెడ్డి, నాగూరావు నామాజీ, కాశన్న, అంజయ్య, పాండురంగారెడ్డి, తిరుపతిరెడ్డి, దేవరాజు, అర్థం రవి, తిరుపతిరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

## యాదాద్రిలో కొనసాగిన భక్తుల రద్దీ

### నృసింహుడికి నిత్యారాధనలు



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగింది. దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలైన్ల వెంట బారులు తీరారు. భక్తుల రద్దీతో ఆలయం, ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. భక్తుల ఆరాధనలు, నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఆలయంలో సంప్రదాయంగా పూజలు కొనసాగాయి. సుప్రభాత సేవతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపిన పూజారులు ప్రతిష్ఠమూర్తులకు హారతిని నివేదించి ఉత్సవమూర్తులను పాలతో అభిషేకించారు. అనంతరం కవచమూర్తులకు స్వర్ణపుష్పార్చన జరిపారు. నిత్యకైంకర్యాలలో భాగంగా సోమవారం శ్రీ స్వామిని ఆరాధిస్తూ అష్టోత్తరం, సుదర్శన నారసింహహోమం, నిత్యకల్యాణం, అలంకార సేవోత్సవాలను సాంప్రదాయంగా నిర్వహించబడ్డాయి. తొలుత వేదమంత్రోచ్ఛరణలతో శ్రీ సుదర్శన నారసింహహోమం జరిపారు. అనంతరం అలంకరించిన కల్యాణమూర్తులను గజవాహనంపై అధిష్టింపచేసి వైభవంగా సేవోత్సవాన్ని చేపట్టారు. తదుపరి నిత్యకల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమశాస్త్రరీత్యా చేపట్టారు. కల్యాణ విశిష్టతను, వచ్చే పుణ్యఫలంపై ప్రధాన పూజారి భక్తులకు వివరించారు. ఆర్జిత భక్తులకు శ్రీ స్వామి తలంబ్రాలతోపాటు ప్రసాదాలను అందజేశారు. సహస్రనామాలతో ఆరాధిస్తూ జరిపిన అష్టోత్తరంలో భక్తులు కుటుంబ సభ్యులతో పాల్గొని ఆశీస్సులు పొందారు. సాయంత్రం వేళ అలంకార జోడు సేవోత్సవాన్ని ఆలయ ఆచారంగా నిర్వహించారు. రాత్రి ప్రతిష్టమూర్తులకు ఆరాధన జరిపి సహస్రనామార్చన నిర్వహించారు.

అనుబంధంగా కొనసాగుతున్న చరమూర్తుల సన్నిధిలో విశిష్టతన రామలింగేశ్వరుడిని ఆరాధిస్తూ మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. బిళ్వపత్రాలతో అర్చించి ఆరాధించారు. స్మార్థ కృష్ణాష్టమి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలను పూజారులు చేపట్టారు. పక్కనే గల శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలలో భక్తులు విశేషంగా పాల్గొని సత్యదేవునికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పుష్కరిణిలో పుణ్య స్నానం ఆచరించి పుష్కరిణి చెంతగల ఆంజనేయస్వామికి పలువురు ప్రదక్షిణలు జరిపారు.

# విజయభాను

## సంపాదకీయం

### గోరఖ్‌పూర్ ఘోరం

పేదరికం, పోషకాహార లోపం, గృహవసతి, పారిశుద్ధ్య వసతులు లేకపోవడం, మురికి నీరు బాటలలో పారడం వంటి అనేక కారణాల వల్ల పిల్లలు రోగాల బారిన పడి మరణిస్తున్నారు. యూపీ పెద్ద రాష్ట్రమైనందువల్ల తూర్పు ప్రాంతం గొంతు వినిపించలేక అణచివేతకుగురవుతున్నది. దేశవ్యాప్తంగానే వైద్య సదుపాయాలు చక్కగా లేవు.తూర్పు ఉత్తర్రపదేశ్‌లో మరింత దారుణంగా ఉన్నది. పేదలకు కనీస వైద్య వసతులు కల్పించడంప్రభుత్వాలు తమ బాధ్యతగాభావించాలె. ఉత్తర్రపదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ వైద్య కళాశాల దవాఖానలో ఐదురోజుల వ్యవధిలో అరువై మందికి పైగా పిల్లలు మరణించడం దిగ్భ్రాంతికరం. ప్రకృతి వైపరీత్యాల వల్లనో, అనూహ్యంగా ప్రబలిన మహమ్మారి వల్లనో కాకుండా, మానవ తప్పిదాల వల్ల పసి ప్రాణాలు గాలిలో కలువడం ఆవేదన కలిగిస్తున్నది. దవాఖానలోని నవజాత శిశువులు ఉండే వార్డు, మెదడు వాపు వ్యాధిగ్రస్తులు ఉండే వార్డులలోనే మరణాలు సంభవించాయి. ఆక్సిజన్ సరఫ రా ఏర్పాటు లేకపోవడం వల్ల పిల్లలు మరణించారనే ఆరోపణలు ఉన్నాయి. రోగులకు ప్రాణవాయువును సరఫరా చేసే ప్రైవేటు సంస్థకు దవాఖాన నిర్వాహకులు వెంటదివెంట బిల్లులు చెల్లించడం లేదు. 68 లక్షల రూపాయల మేరకు బాకీ పెరుగడంతో, ఇక సరఫరా ఆపివేయవలసి వస్తుందని ఆ సంస్థ పదేపదే హెచ్చరించింది. అయినా దవాఖాన నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో ఆ సంస్థ ఆక్సిజన్ సరఫరాను నిలిపివేసింది. ఈ పరిణామానికి ఆందోళన చెం దిన ఆయా వార్డులలోని సిబ్బందిని యాజమాన్యానికి పరిస్థితిని ఒకరోజు ముందే వివరించా రు. అయినా నిర్వాహకులు పట్టించుకోలేదు. ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవడంతో రోగగ్రస్థులైన పిల్లలు మరణించారు. ఈ దారుణానికి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తూ నే ఉన్నది. దవాఖాన నిర్వాహకులు ఏ మాత్రం మానవీయంగా స్పందించినా ఇంతటి దారు ణం సంభవించకపోయేది. దేశవ్యాప్తంగా ప్రజలకు వైద్య సదుపాయాలు అందడం లేదనడానికి గోరఖ్‌పూర్ ఉదంతం తాజా ఉదాహరణ. గోరఖ్‌పూర్ దుర్ఘటన జరిగిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందన ఏ మాత్రం బాధ్యతాయుతంగా లేదు. పిల్లల మరణాలు ఆక్సిజన్ కొరత వల్ల జరుగలేదని, వేర్వేరు వ్యాధుల వల్ల మరణించారని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. దవాఖాన నిర్వాహకులు కూడా ఇదే మాట అంటున్నారు. కానీ పిల్లల మరణాల పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో దవాఖాన నిర్వాహకులు ఆక్సిజన్ సరఫరా చేసే సంస్థకు 21 లక్షల రూపాయలు చెల్లించినట్టు తెలుస్తున్నది. మొదటే అప్రమత్తమైతే ఈ ఘోరం జరుగకపోయేది. గోరఖ్‌పూర్‌లోని ఇదే బీఆర్డీ వైద్య కళాశాల దవాఖాన లో 2012 నుంచి మూడువేల మంది పిల్లలు మరణించారని ఒక ఆంగ్ల పత్రిక వెల్లడించింది. అయినా ఈ దవాఖానలో సదుపాయాల గురించి ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదు. పసిపిల్లలు మరణాలకు రెండురోజుల ముందే ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ బీఆర్డీ కళాశాల దవాఖానను సందర్శించి, సౌకర్యాలు ఎట్లా ఉన్నాయో ఆరాతీశారు. ముఖ్యమంత్రి స్వయంగా సందర్శించిన తరువాత కూడా దవాఖాన పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నదంటే, ఈ పర్యటనలు, సమీక్షలు ఎంత మొక్కుబడిగా సాగుతున్నాయో తెలుస్తున్నది. ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా ఇటీవలే అధికారం చేపట్టి ఉండవచ్చు. కానీ ఆయనకు గోరఖ్‌పూర్ నియోజకవర్గంతో ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. 1998 నుంచి వరుసగా ఐదు పర్యాయాలు పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఇక్కడి ప్రజలకు వైద్య సదుపాయాలు ఏమేర ఉన్నాయో ఇప్పటికే ఆయనకు అవగాహన ఏర్పరుచుకోవలసింది. పిల్లలు మరణించారనే వార్తలు రాగానే అధికారులపై చర్యలు తీసుకోవడం, దర్యాప్తులకు ఆదేశించడం వరకు బాగానే ఉన్నది. కానీ మూల కారణాలను అన్వేషిస్తే నాయకుల బాధ్యతారాహిత్యమే ప్రధానమైనదిగా కనిపిస్తుంది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలో ఉన్నది కనుక ఇతర రాజకీయపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తుంటే, ఉత్తర్రపదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నది. కానీ ఉత్తర్రపదేశ్‌లో వైద్య మౌలిక సదుపాయాలు ఇంత అధ్వాన్నంగా మారడానికి బీజేపీతో పాటు అన్ని పార్టీల బాధ్యతా ఉన్న ది. ప్రజల ఆరోగ్య పరిరక్షణ పట్ల ఇప్పటివరకు ఏ పార్టీ పట్టించుకోలేదు. దవాఖానలో ఐదు రోజుల్లోనే భారీగా మరణాలు సంభవించడం వల్ల అదొక సంచలనవార్తగా మారింది. కానీ ఉత్త ర్రపదేశ్ రాష్ట్రంలో, అందులోనూ తూర్పు ప్రాంత జిల్లాలలో రోగాలు ప్రబలడం, మరణాలు సంభవించడం ఏటా జరుగుతూనే ఉన్నది.

# కిలిమంజారోపై 'సప్తపది'

- కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించిన తెలంగాణ విద్యార్థులు
- శిఖరాగ్రంపై 100 అడుగుల జాతీయ పతాకావిష్కరణ



హైదరాబాద్: తెలంగాణకు చెందిన ఏడు గురు విద్యార్థులు ఆఫ్రికాలోకెల్లా అత్యంత ఎత్తయిన కిలిమంజారో పర్వత శిఖరాన్ని అధిరోహించారు. వీరిలో పలువురు గిరిజన, బీసీ ఆశ్రమ పాఠశాలల విద్యార్థు లుండటం విశేషం. శిఖరాగ్రాన 100 అడుగుల జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య దిన సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. సీఎం కేసీఆర్, గిరిజన వీరుడు కుమ్రం భీంల చిత్రపటాలను ప్రదర్శించారు. ఈ బృందంలో వనపర్తి సాంఘిక సంక్షేమ పాఠశాలలో పదో తరగతి చదువు తున్న సబావత్ సునీత కూడా ఉండటం విశేషం! ఆమెతో పాటు నాయిని మల్లేశ్ (ఆసిఫాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాల), ఆనంద్‌కుమార్, శ్రీకుమార్, అరుణ్ కుమార్ (నల్లగొండ), చరణ్‌రాజ్ (నాగర్‌కర్నూలు వాసి, కింగ్‌కోఠీ బీసీ సంక్షేమ హాస్టల్ డిగ్రీ విద్యార్థి), రాఘవేంద్ర (మహబూబ్‌నగర్) బ ృందంలో ఉన్నారు. ఏపీ నుంచి సత్యారావు (డిగ్రీ విద్యార్థి, బంగారుపాళెం, విశాఖపట్నం), రఘునీథ్ (మౌంటెనీరింగ్ గైడ్, తాడేపల్లి, గుంటూరు) ఈ బ ృందంలో ఉన్నారు.

తమిళనాడు నుంచి నలుగురు, పశ్చిమ బంగ, మహా రాష్ట్రల నుంచి ఒక్కొ క్కరు కూడా బృందంలో ఉన్నారు. మొత్తం 15 మందితో కూడిన భారత బృందం ఈ నెల 10న పర్వతారోహణకు శ్రీకారం చుట్టింది. పర్వతారోహకుడు శేఖర్‌బాబు నేత ృత్వంలో సోమవారం సాయంత్రానికల్లా 5,895 మీటర్లు ఎక్కి శిఖరాగ్రాన్ని చేరి విజయపతాక ఎగురవేసింది. ఆనంద్‌కుమార్ 2014లో ప్రపంచంలో ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించారు. పర్వతారోహ ణను విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థు లను సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ అభినందించారు. సీఎం కేసీఆర్ చొరవే ఈ విజయానికి కారణ మన్నారు. గిరిజన విద్యార్థులకు అత్యుత్తమ విద్య, అవకాశాలను కల్పిస్తున్న సీఎంకు, గిరిజన సంక్షేమ మంత్రి చందూలాల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# అంతరిక్షంలోకి సూపర్ కంప్యూటర్

మయామి: డ్రాగన్ అనే మానవరహిత సరకు రవాణా అంతరిక్ష నౌకలో ఒక సూపర్ కంప్యూటర్‌ను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు పంపేందుకు స్పేస్‌ఎక్స్ సిద్ధమైంది. హెచ్‌పీ కంపెనీ తయారుచేసిన ఈ సూపర్ కంప్యూటర్...భవిష్యత్ అంతరిక్ష కార్యక్రమాలపై వ్యోమ గాములకు దిశానిర్దేశం చేయగలదు.

అమెరికా ఫ్లోరిడాలోని కేప్ కేనవెరల్ నుంచి స్థానిక కాలమానం ప్రకారం ఫాల్కన్ 9 అనే రాకెట్ ద్వారా దీనిని ప్రయోగించనున్నారు. రాకెట్‌ను ప్రయోగించిన దాదాపు 10 నిమిషాల్లోనే అది మళ్లీ కేప్ కేనవెరల్‌కు వచ్చి ల్యాండ్ అవడానికి ప్రయత్నిస్తుంది. రాకెట్‌ను ప్రయోగించిన ప్రతిసారి, దానిని మళ్లీ అదే ప్రదేశానికి రప్పించి అందు లోని పరికరాలను పునర్వినియోగించాలని స్పేస్-ఎక్స్ గతంలో నిర్ణయించింది.

# భారత విస్తరణ కాంక్షతోనే సమస్య!: పాక్



ఇస్లామాబాద్: భారత విస్తరణ కాంక్షే ఇరుదేశాల మధ్య నిర్మాణాత్మక, ద్వైపాక్షిక చర్చలకు ప్రధాన అడ్డంకిగా మారిందని పాకిస్తాన్ ప్రధాని షాహిద్ అబ్బాసీ విమర్శించారు.

భారత్ కారణంగానే ఈ చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందన్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాకిస్తాన్ ప్రజలనుద్దేశించి ప్రసంగించిన అబ్బాసీ..

తామెప్పుడూ భారత్‌తోపాటు మిగిలిన దేశాలతోనూ సానుకూల, నిర్మాణాత్మక సంబంధాల కోసమే ప్రయత్నిం చామన్నారు.

చైనా ఉప ప్రధాని వాంగ్ యాంగ్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

# ఉ.కొరియా దిగుమతులను నిలిపేసిన చైనా

బీజింగ్: ఐక్యరాజ్యసమితి కొత్త ఆంక్షల నేపథ్యంలో.. మిత్రదేశం ఉత్తరకొరియా నుంచి దిగుమతులను తాత్కాలికంగా నిషేధిస్తున్నట్లు చైనా ప్రకటించింది. బొగ్గు, ఇనుము, ముడి ఇనుము, సముద్ర ఆహార ఉత్పత్తుల దిగుమతులను మంగళవారం నుంచి నిషేధిస్తున్నామని వెల్లడించింది. గత ఫిబ్రవరి నుంచే బొగ్గు దిగుమతిని నిలిపివేయగా.. తాజాగా ఇనుము తదితరాలను నిలిపి వేస్తున్నామని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉ.కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మధ్య మాటల యుద్ధం తీవ్రమైన నేపథ్యంలో చైనా ఈ నిర్ణయం తీసుకుంది. తాజా ఆంక్షలను అమలు చేయడం వల్ల చైనాకు సుమారు రూ.6,500 కోట్ల రెవెన్యూ నష్టం వాటిల్లనుందని అంచనా.

# ఆల్కహాల్ వల్లే మనుగడ



లండన్: గడ్డ కట్టిన నదుల్లో గోల్డ్ ఫిష్ ఏ విధంగా మను గడ సాధిస్తోందన్న ప్రశ్నకు యూనివర్సిటీ ఆఫ్ ఓస్లో, యూనివర్సిటీ ఆఫ్ లివర్ పూల్ శాస్త్రవేత్తల బృందం సమాధానం కనుగొంది. సాధారణంగా గడ్డ కట్టిన నదుల్లో ఆక్సిజన్ లభించకపోవటం వల్ల వెన్నెముక గల జీవాలు వెంటనే మరణిస్తాయి. కానీ గోల్డ్ ఫిష్, క్రూసియన్ కార్ప్ చేపలు మాత్రం 5 నెలలు జీవి స్తాయి. గోల్డ్ ఫిష్, క్రూసియన్ కార్ప్ శరీరంలో రెండు సెట్ల ఎంజైములు ఉన్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మొదటి ఎంజైమ్ ఇతర జీవుల్లో పనిచేసే మాదిరిగానే పనిచేస్తుంది.రెండో సెట్ మాత్రం ఆక్సిజన్ లేనప్పుడు లాక్టిక్ యాసిడ్‌ను ఇథనాల్‌గా మార్చి మొప్పలు ద్వారా బయటకు పంపుతాయి. ఇలా చేయటం వల్ల వాటి శరీరంలో లాక్టిక్ యాసిడ్ అధికంగా ఉత్పత్తి కాకుండా ఉంటుంది. ఇది 80లక్షల ఏళ్ల క్రితమే గోల్డ్ ఫిష్‌లో చోటు చేసుకుంది.

## కవి సమయం

### 'జీవన ప్రయాణం'

కలసి మెలసి మెలుగుదాం
చేయి చేయి కలుపుదాం
కలుపుగోరు జీవితాలు గడుపుదాం.
అన్ని వున్న భారతావనిలో...
పుణ్యమైన పుడమిన పుట్టినాం;
శ్రమ జీవన సాధనలో...
కలిమి గలిగి యెదుగుదాం.
కరువు పెరిగి బుఱ్ఱన
బరువు బుట్ట యెలాన?
ధరలు అదుపు చేయాలోయ్
పాలన అని పించాలోయ్
మాటలతో కోటలు కావు
గాంధీబాబు చెప్పిందినవోయ్;
పల్లె, పేట పాటులతో...
నిండివున్న నవ్వులతో...
నిక్కచ్చి స్వరాజ్య మోనోయ్


...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : శ్రావణ : తిథి : నవమి మ.1.30; రోహిణి రా.12.09; సా.వ.4.42ల 6.11 తె.వ.5.21ల | బుధవారం 16-08-2017

**మేషం** : ప్రియతములతో విరామ కాలక్షేపాలతో పాల్గొంటారు. కపటం లేని మీ ఆలోచనలు, సలహాలు మీకు అభిమానుల్ని సంపాదించి పెడుతుంది. ఇంటా బయటా సమస్యలు తలెత్తినా తెలివితో పరిష్కరిస్తారు. రవాణా వ్యవ హారాల్లో ఆచితూచి వ్యవహరించండి. **వృషభం** : విదేశీ యత్నాలలో కొన్ని అవాంతరాలు ఎదురైనా విజయం సాధిస్తారు. వ్యాపారాభివృద్ధికి కొత్త కొత్త ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. విలాస వస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. రుణ విముక్తులు కావాలనే మీ ఆలోచన ఫలిస్తుంది. సోదరీ, సోదరులతో కలహాలు తలెత్తుతాయి. **మిథునం** :రవాణా రంగాల వారికి ప్రయాణీకులతో ఇబ్బందులను ఎదుర్కొంటారు. డాక్టర్లు అరుదైన శస్త్రచికిత్సలను సమర్థంగా పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. పెద్దల ఆరోగ్యములో మెళకువ అవసరం. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసు కుంటారు. **కర్కాటకం** : రాజకీయ నాయకులకు మంచి పేరు, ఖ్యాతి లభి స్తుంది. రవాణా వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించండి. స్త్రీలకు తలపెట్టిన పనిలో ఆటంకాలను ఎదుర్కొంటారు. అనవసరపు సంభాషణ వల్ల సహోద్యోగులతో ఆకస్మిక భేదాభిప్రాయాలు తలెత్తే ఆస్కారం ఉంది. ప్రముఖుల కలయికతో పనులు పూర్తవుతాయి. **సింహం** : ఇతరులను ధనసహాయం అడగటానికి అభిజాత్యం అడ్డువస్తుంది. వృత్తుల వారికి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. ఉద్యోగస్తులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. షాపు గుమాస్తాలు, అకౌంట్లకు ఒత్తిడి, పనిభారం అధికం. **కన్య** : బ్యాంకు పనులు మందకొడిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. కుటుంబీకుల కోసం నూతన పథకాలు రూపొందిస్తారు. పోస్టల్, టెలిగ్రాఫ్, కొరియల్ రంగాలవారికి శ్రమాధిక్యత. జూదాల్లో ధననష్టం, చికాకులు ఎదుర్కొంటారు. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం ఆలోచన విరమించుకోవడం మంచిది. **తుల** : చిన్ననాటి వ్యక్తుల కలయిక సంతోషం కలిగిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల పనివారికి ఒత్తిడి, చికాకులు వంటివి అధికమవుతాయి. గతంలో నిలిపి వేసిన వ్యాపారాలు, పనులు పునః ప్రారం భించేందుకు చేయు యత్నాలు కలిసివస్తాయి. కోర్టు వ్యవహారాలు అను కూలిస్తాయి. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. **వృశ్చికం** :ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి ఉంటుంది. కుటుంహంలో చికాకులు తొలగిపోయి మానసిక ప్రశాంతత నెలకొంటుంది. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. రాజకీయ నాయకులకు ఊహించని మార్పులు చోటుచేసుకుంటాయి. **ధనుస్సు** : ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. లౌక్యంగా పనులు చక్కబెట్టుకోవాలి. ఆస్తి, స్థల వివాదాలు కొలిక్కివస్తాయి. పాత మిత్రుల కలయికతో మీలో కొత్త ఉత్సాహం చోటుచేసుకుంటుంది. విద్యార్థులకు తోటివారి కారణంగా చికాకులు తప్పవు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో పోటీతత్వము పెరుగుతుంది. **మకరం** : ఆదాయ వ్యయాలకు ఏమాత్రం పొంతన ఉండదు. మీ మాటే నెగ్గాలనే పట్టుదల మంచిది కాదు. స్త్రీలకు ఆరోగ్యంలో చిన్న చిన్న చికాకులు తలతెత్తగలవు. జాగ్రత్తలు అవసరం. బ్యాంకు వ్యవహారాల్లో ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రైవేట్ సంస్థల్లోని వారు తోటి వారితో స్నేహ భావంతో సంచరిస్తారు. **కుంభం** :మీ శ్రీమతి వైఖరిలో మార్పు సంతోషం కలిగిస్తుంది. ఆత్మీయుల రాకతో గృహం కళకళ లాడు తుంది. ప్రయాణాల్లో ఊహించని చికాకులను ఎదురవుతాయి. నిరుద్యోగు లకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం క్షేమదాయకం. కొబ్బరి పండ్ల పూల వ్యాపారులకు కలిసి రాగలదు. **మీనం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. మీ శ్రీమతి సలహా పాటించడం చిన్నతనంగా భావించకండి. రావలసినధనం అనుకోకుండా చేతి కందుతుంది. విద్యార్థులు అనవసర భయాందోళనలు విడనాడి శ్రమించినట్లైతే జయం పొందగలరు.

# మహిమాన్వితం... శివగంగ ఆలయం



## సంకీర్తన

పద్మాకారంలో ఆలయం. కింద గంగమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహా ద్భుతమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మా ణమైన ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ.. భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. కాక తీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడే స్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తే శ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమృతే శ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్ట కామే శ్వరుడు, శ్రీముకే శ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణి కర్ణికే శ్వరుడు, శ్రీమహా నందీశ్వరుడు, శ్రీఅమరావతీ శ్వరుడు, శ్రీకాశీపతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆల యాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మిం చడం విశేషం. సహజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ ఆర్చిలతో పాటు మధ్యలో ఉన్న కొలను ను అద్భుతంగా నిర్మించారు.ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.

తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విష్ణు భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది.

1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబు తుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# ఎత్తిపోతల పథకాల తరలింపునకు

## నిధులు విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



మఠంపల్లి : పులిచింతల జలాశయంలో ముంపునకు గురవుతున్న నాలుగు ఎత్తిపోతల పథకాలను ఎగువ ప్రాంతాలకు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు విడుదల చేసింది. మఠంపల్లి మండలంలోని గుర్రంబోడు ఎత్తిపోతలతో పాటు మేళ్లచెరువు మండలంలోని అడ్లూరు, చింత్రియాల, రేబల్లె ఎత్తిపోతల పథకాల పునర్నిర్మాణాలకు రూ.49కోట్లు మంజూరయ్యాయి. 1998, 2000 మధ్య కాలంలో నిర్మించిన ఈపథకాల పరిధిలో సుమారు 4,500 ఎకరాల వరకు భూమలు సాగవుతున్నాయి. పులిచింతల ప్రాజెక్టులో నీరు నిల్వ చేసిన సమయంలో, వరదలు సంభవించిన సందర్భాల్లో ఈ పథకాలు ముంపునకు గురయ్యాయి. కొన్ని గ్రామాల రైతులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ నేపథ్యంలో వీటిని సురక్షిత ప్రదేశాల్లో పునర్నిర్మించాలన్న డిమాండ్ రైతుల నుంచి రావడంతో ఇక్కడి ఐడీసీ అధికారులు రూ.49కోట్లతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 1995లోనే ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రారంభించినందున అనంతర కాలంలో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాలకు పరిహారం చెల్లించేందుకు ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఐడీసీ అధికారుల ప్రతిపాదనలను పక్కన పెట్టారు. 2014 డిసెంబర్ 2న ఈ విషయంపై ఉమ్మడి కొర్రీ శీర్షికతో ఈనాడులో వెలువడిన కథనంతో అధికారులు ఏపీ నుంచి నిధులు రాబట్టేందుకు ఒత్తిడి పెంచారు. సూర్యాపేట జిల్లా ఏర్పడ్డాక కలెక్టర్ సురేంద్రమోహన్ నిధుల మంజూరు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ముంపునకు గురవుతున్న నాలుగు ఎత్తిపోతల పథకాలను ఎగువ ప్రాంతాల్లో పునర్నిర్మించేందుకు టెండర్లను పిలుస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తికాగానే పనులను ప్రారంభిస్తాం. గుర్రంబోడు ఎత్తిపోతల పంపు హౌజ్, మోటార్లును మాత్రమే ఎగువ ప్రాంతానికి తరలిస్తాం. నీటిని విడుదల చేసే పైపులైన్ యథావిధిగా ఉంటుంది. అడ్లూరు, రేబల్లె, చింత్రియాల ఎత్తిపోతలను పూర్తిగా పునర్నిర్మిస్తాం. గతంలో ఉన్న ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు చర్యలు తీసుకుంటాం.

# భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

కంఠేశ్వర్ : దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని, ఎన్నికల సమయంలో పండితుల పోస్టులు పండితులకే అన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ఎండీ జమీలుల్లా డిమాండు చేశారు.

నగరంలో కోటగల్లీలో గల మార్కండేయ మందిరంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండితుల పదోన్నతులపై ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విడుదలైన 17, 18 జీవోలను ఇప్పటి వరకు అమలుపర్చలేదని, ఈ జీవోలపై ఉన్న స్టే ఎత్తివేసే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అంటూ సుప్రీంకోర్టు 2008లో ఇచ్చిన ఉత్తర్వులను తుంగలో తొక్కి గ్రేడ్ 2 పండితులకు డిప్యుటేషన్లు వేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు ఉపాధ్యక్షుడు గరిట్యాల ప్రసాద్, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, కైలాస్, సతీశ్‌వ్యాస్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రసవ సేవల జాప్యంపై ధర్నా



బోధన్ పట్టణం : ఏరియా ఆస్పత్రిలో సకాలంలో ప్రసూతి వైద్య సేవలందలేదని గర్భిణి బంధువులు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్రీ వైద్య నిపుణులు పరిశీలించకుండా నిజామాబాద్ వెళ్లాలని, లేదంటే మరెక్కడికైనా తీసుకెళ్లాలని సూచించారని ఆరోపించారు. ప్రసవ సేవలందించని వైద్యులను విధుల నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. గర్భిణి బంధువుల వివరాల మేరకు... సాలూర గ్రామానికి చెందిన స్వాతిని రెండో కాన్పు కోసం సోమవారం ఉదయం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. డ్యూటీలో ఉన్న వైద్యాధికారి పరీక్షించి పరిస్థితి క్లిష్టంగా ఉందని, ఇక్కడ వైద్య నిపుణులు లేరని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని తెలిపారు. విధుల్లో ఉన్న నిపుణులు పరిశీలించాలని కోరినా సమయానికి రాకపోవడంతో గర్భిణికి నొప్పులు అధికమయ్యాయి. అయినా స్పందించకపోవడంతో ప్రైవేటుకు వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని చెబుతున్నా ఇక్కడ సరైన స్పందన కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతకుముందు వైద్యులతో వాగ్వాదా నికి దిగినా పట్టించుకోకపోవడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ధర్నా నిర్వహించినట్లు బంధువులు పాండు, రమేష్ పేర్కొన్నారు. ఆ ప్రసవానికి సిజేరియన్ చేయాల్సిన అవసరముందని గుర్తించి మత్తుమందు వైద్యులు లేక కేసును జిల్లా ఆస్పత్రికి తరలించడానికి నిర్ణయించారని, స్త్రీ వైద్య నిపుణులు వచ్చేలోగా గర్భిణిని తరలించినట్లు వైద్యాధికారి తెలిపారు.

# క్షత్రియ కళాశాలలో స్వాగత సందడి

ఆర్మూర్ : ఆర్మూర్ క్షత్రియ జూనియర్ కళాశాల నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమం స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆట పాట, సాంస్కృతిక ప్రదర్శనలతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రజాదరణ పొందిన సినిమా పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ విద్యార్థులు అలరించారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పండుగ, ఇతర కార్యక్రమాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. దేశంలో జీవిస్తున్న అన్ని మతాల వారు ఒక్కటేనని చాటిచెబుతూ, మత సామరస్యాన్ని ప్రబోధిస్తూ ప్రత్యేక ప్రదర్శన ద్వారా అందరిలో దేశభక్తిని రగిలించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర రీసోర్స్‌గ్రూపు సభ్యుడు, పుస్తక రచయిత అయాచితుల లక్ష్మణ్‌రావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మార్కులు ప్రధానం కాదని, గుణవికాసం ముఖ్యమని తెలిపారు.

నేడు పలు విద్యా సంస్థల్లో చదువు పరీక్షలు, మార్కులకే పరిమితమవుతోందని, మార్కుల కంటే గుణం, శీలం, సంస్కారం, పెద్దలపట్ల గౌరవభావం ప్రధానమని పేర్కొన్నారు. విద్యార్థులు సన్మార్గంలో నడవాలని, క్రమశిక్షణతో మెదలాలని, మంచి నడవడిని అలవర్చుకోవాలని సూచించారు.

క్షత్రియ కళాశాల ఛైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తి, సామాజిక దృక్పథం కలిగి ఉండాలని, చక్కని వ్యక్తిత్వంతో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కళాశాల వైస్‌ఛైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దాడి చేసింది తెలంగాణ ద్రోహులే

## టీవీయూవీ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్



కామారెడ్డి : రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం తలపెట్టిన అమరుల స్ఫూర్తి యాత్రకు తెలంగాణ ద్రోహులే అడ్డుతగులుతున్నారని టీవీయూవీ రాష్ట్ర అధ్యక్షుడు నిజ్జన రమేశ్ ఆరోపించారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కోదండరాం యాత్రను అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. నాడు తెదేపా, కాంగ్రెస్‌లో ఉండి తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా పోరాడిన వారే నేడు తెరాసలో చేరి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థి సంఘాల నాయకులపై దాడి హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తున్నారన్నారు. తెరాస ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె దించాలని పిలుపునిచ్చారు.

ఎట్టి పరిస్థితుల్లో 31 జిల్లాల్లో అమరుల స్ఫూర్తియాత్రను చేపడతామన్నారు. కార్యక్రమంలో టీవీయూవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్, కార్యదర్శి రజినీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాను, టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌నాయక్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సందీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరుణ్, ఆయా పక్షాల నాయకులు నరేష్, బాలునాయక్, జబ్బర్‌నాయక్, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిని కాపాడటంలో ముందుంటాం

## భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి అల్జాపూర్ శ్రీనివాస్



బోధన్ : సమాజంలో శాంతిని కాపాడటంలో తాము అందరికంటే ముందుంటామని, అయితే అరాచకాలు జులుంను మాత్రం సహించమని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. ఆయన బోధన్‌లో విలేకరులతో మాట్లాడారు. రెంజల్ మండలం నీల గ్రామంలో చోటుచేసుకున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. హిందూవులను రెచ్చగొట్టే విధానాలను పోలీసులు నిర్భయంగా అణిచివేయాలన్నారు. ఇసుక మాఫియా నడుపుతున్న వ్యక్తులు అవినీతి సొమ్ముతో దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. పోలీసుల స్పందన నిరాశాజనకంగా ఉందన్నారు. లోగడ పోలీసు శాఖ హోంగార్డుపై దాడి చేశారని గుర్తు చేశారు. సిబ్బందిపై జరిగిన దాడిని కప్పిపుచ్చారన్నారు. మహారాష్ట్ర పెళ్లి బృందంపై ఇటీవల రెంజల్ మండలంలో దాడి చేశారని పేర్కొన్నారు. శాంతిని చెడగొడుతూ రౌడియిజం చెలాయిస్తున్న వారిని కఠినంగా అణిచివేయాలన్నారు.

అధికారంలోకి వచ్చాక కేవలం వంద రోజుల్లో నిజాంషుగర్స్ ప్రైవేటీకరణ రద్దు చేసి ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలు చేపడుతుందని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఏమైందని అల్జాపూర్ శ్రీనివాస్ ప్రశ్నించారు. నడుస్తున్న పరిశ్రమకు తాళం వేయించిన గొప్ప పాలకుడిగా కేసీఆర్‌ను అభివర్ణించారు. కర్మాగారం మూతబడటంతో బోధన్ గుర్తింపు దెబ్బతిందన్నారు. జీతాలు లేక శ్రామికులు, వారి కుటుంబాలు దయనీయంగా బ్రతుకుతున్నారన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కూడా కమలం వికసిస్తుందని జోస్యం చెప్పారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, ప్రజల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ మోసాలను వివరించాలన్నారు. పార్టీ నాయకులు సుభాష్, అడ్లూరి శ్రీనివాస్, అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# సింగూర్ జలాల విడుదలకు సీఎం హామీ

## పోచారం శ్రీనివాసరెడ్డి



బీర్కూర్ : సింగూరు జలాల విడుదలకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని నిజాంసాగర్ ఆయకట్టు రైతులు అధైర్యపడొద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలియ జేశారు. బీర్కూర్ మండల కేంద్రం లో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు..సాగర్ ఆయకట్టు కింద పంట సాగు చేసిన పంటలను ఒక గుంట ఎండిపోకుండా కాపాడే బాధ్యత తనదేనని అన్నారు. పంట నష్టపోకుండా అవసరం మేరకు సింగూరు జలాలను విడుదల చేయించి పంటలను ఎండిపోకుండా చూస్తానన్నారు. ఇందులో ఎలాంటి సందేహం వద్దని రైతులకు సూచించారు. సింగూర్ జలాల విడుదల విషయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు నాకు బుద్ధి చెప్పనక్కర్లేదని పంటలను కాపాడుకునే తెలివి నా దగ్గర ఉందన్నారు. అది వారు తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలో పంటలు ఎండిపోకుండా సింగూరు జలాలను విడతల వారీగా విడుదల చేస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మీనా, ఆర్డీవో రాజేశ్వర్, సర్పంచి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇక జిల్లా నుంచే పరీక్షల నిర్వహణ

## 18 మందిసభ్యులతో బోర్డు ఏర్పాటు




హైదరాబాద్ : జిల్లాల పునర్విభజన నేపథ్యంలో అన్ని శాఖలు విభజన చెందాయి. కానీ, జిల్లా సాధారణ పరీక్షల బోర్డు(డీసీఈబీ)ను మాత్రం విభజించలేదు. గత నెలలో రాష్ట్ర పాఠశాల విద్యాసంచాలకుడు జి.కిషన్, రాష్ట్ర విద్యాపరిశోధన సాంకేతిక సంస్థ సంచాలకుడు శేషుకుమార్ జిల్లా విద్యాశాఖాధికారులతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి డీసీఈబీను విభజన చేయాలని, ప్రతి జిల్లాకు ఒకటి ఉండే విధంగా జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో సూర్యాపేట జిల్లాకు 18 మంది సభ్యులతో కొత్త బోర్డును ఏర్పాటు చేశారు. ఇందులో ఛైర్మన్, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, ముగ్గురు ఎక్స్ అఫీషియో సభ్యులు, 11మంది సభ్యులు ఉన్నారు. బోర్డు పనితీరును సంవత్సరానికోసారి సమీక్షించుకొని మూడు సంవత్సరాల వరకు సభ్యుల పదవీకాలం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బోర్డు అధ్యక్షురాలుగా జిల్లా విద్యాశాఖాధికారి బి.వెంకటనర్సమ్మ వ్యవహరించగా, ప్రస్తుతం ఉపవిద్యాధికారిగా ఎవరూ లేకపోవడంతో ఉపాధ్యక్షుని పదవి ఖాళీగా ఉంది. డీసీఈబీ ఏర్పాటు కావడంతో జిల్లాలో పరీక్షల నిర్వహణ ఇక సులభతరం కానుంది. జిల్లాల పునర్విభజన జరిగిన నాటి నుంచి పరీక్షల నిర్వహణ నల్గొండలో జరిగాయి. ప్రస్తుతం సూర్యాపేట నుంచే కార్యకలాపాలు కొనసాగనున్నాయి. పరీక్షల ఫీజు చెల్లింపులో, నిర్వహణలో ఇబ్బందులను ఇక నుంచి త్వరగా అధిగమించవచ్చు. జిల్లాలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు నెల, త్రైమాసిక పరీక్షల ప్రశ్నపత్రాలు, నిర్దేశిత రుసుంలను తీసుకొని విద్యార్థుల ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట(టీసీ)లను కొత్త జిల్లా కేంద్రాల నుంచే తయారుచేసి పంపిణీ చేయనున్నారు. డీసీఈబీ కార్యాలయాన్ని తాత్కాలికంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోనే నెలకొల్పనున్నారు. కార్యాలయ భవనం గుర్తించే వరకు బోర్డు కార్యకలాపాలను డీఈవో కార్యాలయం నుంచే నిర్వహించనున్నామని డీఈవో వెంకటనర్సమ్మ తెలిపారు.

# ఉప కేంద్రాలకు తాళాలు

## పల్లె ప్రజలకు అందని వైద్యం



ఎడపల్లి : పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాలు ఎప్పుడూ తాళాలు వేసి దర్శనం ఇస్తున్నాయి. గ్రామాల్లో పని చేసే వైద్య సిబ్బంది తమకు పట్టనట్లు వ్యవహరించి తరచూ విమర్శల పాలవుతున్నారు. మండలంలో 14 గ్రామాలతోపాటు రెండు అనుబంధ గ్రామాల ప్రజల కోసం 9 ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి ఏఎన్ఎం, రెండో ఏఎన్ఎంతో పాటుగా ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేశారు. గ్రామల్లో పర్యటించి పేదలకు వైద్య సహాయం అందించాలి. రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప కేంద్రాల్లో అందుబాటులో ఉండాలి. ఉప కేంద్రాలకు వచ్చే రోగులకు ముందుగా ప్రాథమిక చికిత్సలు చేయాలి. పరిస్థితి మేరకు మండల పీహెచ్‌సీకి, లేకపోతే ఏరియా ఆస్పత్రికి పంపించాలి. రోగులతో పాటు గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలతో పాటు తగు సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంటుంది. వీటితోపాటు గ్రామాల్లో మురుగు నిల్వ ఉండకుండా చూడాలి. మురుగు కాల్వల్లో లార్వ(తోక పురుగు) నివారణ, మలేరియా, డెంగ్యూ, అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలి. వీటితో పాటు వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలి. కానీ ఇవేవీ పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఏఆర్పీ క్యాంపు, జైతాపూర్, ఎడపల్లి, కుర్నాపల్లి, జానకంపేట ఉప కేంద్రాల్లో గడ్డి పెరిగి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ప్రస్తుతం వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయి. ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వైద్య సిబ్బంది చుట్టపు చూపుగా గ్రామాల్లో విధులు నిర్వహించి వెళ్తున్నారు. జానకంపేట, అంబం, ధర్మారం గ్రామాల్లో ప్రజలు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎడపల్లి పీహెచ్‌సీలో విధులకు రాకున్నా అక్రమార్కులకు ఉన్నతాధికారులు అండగా ఉంటున్నారు. సంఘ బాధ్యునిగా పని చేసిన అనుభవ ఉండడంతో ఆయనను పట్టించుకున్నవారేలేరు. గత నెలలో సబ్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎడపల్లి పీహెచ్‌సీని రెండు గంటల పాటు క్షుణ్ణంగా తనిఖీ చేసి గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కానీ సిబ్బందికి అవేమీ పట్టినట్లు లేదు.

వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆదేశాలు ఇచ్చా. ప్రజలకు సేవలు అందించాలని సూచించాం. సమయ పాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవారి పై కఠిన చర్యలు ఉంటాయి. ఉప కేంద్రాలకు నిధులు కూడా ఇచ్చాం. వీటితో పరిశుభ్రం చేయించాలి.





## తెలుగు రాష్ట్రాలలోని

# రాక్షస గుళ్ళు

గుప్తనిధి వేటగాళ్ళు నిదినిక్షేపాల కొరకై ప్రాచీన ఆలయాలు,పురాతనకోటలు, పాతకాలపు బురుజులను ధ్వంసం చేసేవారు. ఇప్పుడు వారి దృష్టి ఆంధ్రప్రదేశ్ లో విస్తారంగా వున్న రాక్షస గుళ్ళుపై పడింది.రాక్షసగుళ్ళలో విస్తారంగా నిధినిక్షేపాలు వుండటమే అందుకు కారణమా? అసలు రాక్షసగుళ్ళు అంటే ఏమిటి? నిజంగానే రాక్షసగుళ్ళలో నిధినిక్షేపాలు వున్నాయా?వుంటే వాటి లోకి ఆ నిధినిక్షేపాలు ఎక్కడనుంచి వచ్చాయి? క్రీ.పూ.2000సం.ల నుండి క్రీ.పూ.500సం.ల మధ్యకాలంలో మానవులు ఎటువంటి జీవనం సాగించేవారు? వారు ఎటువంటి పనిముట్లను ఉపయోగించేవారు? వారు ఎలాంటి ఆహారాన్ని తీసుకునేవారు?మరియు వారి జీవనశైలి ఎలా వుండేది? అనే విషయాలను పరిశోధించుటకు చరిత్రకారులకు బాగా ఉపయోగపడిన చారిత్రికఆధారాలు ఈ రాక్షసగుళ్ళు.వీటిని పాండవ గుళ్ళుఅనీ,ఇంగ్లీష్ లో మెగాలిథ్స్ అని అంటారు. కొత్త రాతియుగంలో మనిషి గుంపులు గుంపులుగా సంచారం జీవనం సాగించేవాడట.. ఆ ఆదిమ తెగలు తమలో ఎవరైన చనిపోతే తమకు పునర్జన్మ ఉంటుందని భావించి చనిపోయిన శవాన్ని పెద్ద మట్టి కుంట తయారు చేసి అందులో పెట్టి ఆకులు, నారలతో చుట్టి దాన్ని భూమిలో పాతి పెట్టేవారు. ఆ తరువాత ఆ శవాన్ని ఏదీ పీక్క తినకుండా పెద్ద పెద్ద రాళ్లను చుట్టూ పెట్టేవారట. వీటిని పురావస్తు శాస్త్రవేత్తలు పాండవ గుళ్లు లేదా రాక్షస గూళ్ళు గా వ్యవహరిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రతి జిల్లాలో రాక్షస గుళ్ళు అధికంగా ఉన్నాయి... గుప్తనిధి వేటగాళ్ళు వాటిని త్రవ్వి నాశనం చేస్తున్నారు...







# గుజరాత్‌లోని నిష్కళంక్ మహదేవ్ టెంపుల్

అది పాండవులు కట్టించిన కట్టడం.కాని అది మాత్రం సముద్రంమధ్యలో ప్రశాంతంగా వుంది.అక్కడికి వెళ్ళాలని మీకుంటే సరిపోదు. నువ్వు అక్కడికి రావాలని దానికీ అనిపించాలి.అప్పుడు అదేంచేస్తుందో తెలుసా?అలా కాదని దాని దగ్గరకి వెళ్లాలని ట్రైచేస్తే ఇక అంతే. ఇంతకి అదెక్కడ?ఇప్పుడు మనం తెలుసుకుందాం.అది మన భారతదేశంలోనే అరేబియా సముద్రం లోపల వుంది.ఇక్కడికి వెళ్తే రాగాలమో, లేదో?అనే ప్రశ్నకు సమాధానం కూడా చెబుతాను. ప్రపంచంలో మనకు తెలియని ఎన్నో అద్భుతాలు వున్నాయి. ఒక్కోసారి కొన్ని వింటే ఒళ్ళు పులకరిస్తుంది. రోమాలు నిక్కబొడుచుకుంటాయి. అలాంటిది శివుడి గుడి అయితే అది మహాద్భుతమే. అదే ఈ అద్భుతశివలింగం. అరేబియాసముద్రంలో వుందంటే నమ్మగలమా?నమ్మితీరాల్సిందే. కానీ ఆ గుడిలోకి వెళ్ళాలంటే సాహసయాత్రే అవుతుంది. ఎందుకంటే ఏ మాత్రం సముద్రపు అలలు వుప్పొంగినా, సమయం దాటిపోయినా,మనం శివుడిలో ఐక్యం అయిపోతాం. మరి ఈ అరేబియా సముద్రంలో వున్నటువంటి లింగేశ్వరుని ఆలయం గురించి తెలుసుకోవాలని వుందా? అరేబియా సముద్రంలో ఉన్న ఆ శివాలయం గురించి మీకు తెలుసా ?



# రోజుకో చెంచాడు

వెజ్, నాన్‌వెజ్. కూర ఏదైనా ఘుమఘుమలాడాలంటే, రుచిగా ఉండాలంటే ధనియాల పొడి వేయాల్సిందే. రుచి, సువాసనే కాదు వాటివల్ల ఆరోగ్య ప్రయోజనాలెన్నో ఉన్నాయి.

-ధనియాలకు బియ్యం కడిగిన నీటిని కలిపి మెత్తగా నూరి ముద్దగా చేసుకోవాలి. దానికి పటికబెల్లం చేర్చి రోజూ కొద్ది మోతాదులో పిల్లలకు తినిపిస్తే తరుచూ వచ్చే దగ్గు, ఆయాసం నుంచి ఉపశమనం లభిస్తుంది.

-ధనియాలను దోరగా వేయించి, ఉప్పు కలిపి పొడి చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని రోజుకో చెంచాడు తేనెతో కలిపి తీసుకుంటే అజీర్తి, కడుపు ఉబ్బరంతో బాధపడేవారికి మంచిది.

-షుగర్, బీపీలను కంట్రోల్ చేసేందుకు ధనియాలు ఉపయోగపడుతాయి.

-గర్భవతులు రోజూవారి ఆహారంలో



ధనియాలను తీసుకుంటే ప్రసవం సమయంలో మేలు జరుగుతుంది.

-ధనియాల కషాయంలో పాలు కలుపుకొని తాగితే నిద్ర బాగా పడుతుంది. వర్షాకాలంలో తలెత్తే అజీర్తి సమస్యను ధనియాలను తీసుకోవడం ద్వారా పోగొట్టుకోవచ్చు.


-ధనియాలు రోజూ తీసుకోవడం పిల్లలు, స్త్రీలకు మంచిది. కడుపులో మంట, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

## ఈ నియమాలు పాటిస్తే

# షుగర్ వస్తుందనే భయముండదు...?




మధుమేహము ఎదుర్కోవటం అనేది ఒక క్లిష్టమైన సమస్యగా మారింది. అయితే, సరైన నియంత్రణ మరియు దాని లక్షణాలు గుర్తించి నివారించవచ్చు. మనం ఇక్కడ మధుమేహము ను నివారించటానికి కొన్ని మార్గాల గురించి తెలుసుకుందాము. బరువు నియంత్రణ: మనం బరువును నియంత్రించి రక్తంలోని చక్కెర స్థాయిలను తనిఖీచేయండి. అప్పుడు మధుమేహములో కొంత నియంత్రణ కనపడుతుంది.వ్యాయామం: సరైన వ్యాయామం చేయుటం అనేది ఉత్తమమైన ఆరోగ్య నిర్వహణలో కీలకమైన పాత్రను పోషిస్తోంది. కొన్ని అధ్యయనాల ప్రకారం వ్యాయామం చేయుట వల్ల ఎక్కువ జీవక్రియ మరియు మధుమేహంనకు తక్కువ నష్టం కలుగుతుందని ఫలితాలు వచ్చాయి. ట్రాన్స్ కొవ్వులు తినడం మానుకోండి: శరీరంలో ప్రొటీన్ ,ఇన్సులిన్ ను గ్రహించడానికి శరీరం యొక్క సామర్థ్యాన్ని ఈ కొవ్వులు తగ్గిస్తాయి. అంతే కాకుండా రక్తంలోని చక్కెర స్థాయిలను పెరిగేలా చేస్తుంది. ట్రాన్స్ కొవ్వు కలిగిన ప్రాసెస్ ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది. లేకపోతె మధుమేహ ప్రమాదాలను పెంచటానికి సహాయం చేస్తుంది. తీపి పదార్ధాలకు దూరంగా ఉండాలి : కృత్రిమమైన తియ్యని ప్రాసెస్ చేసిన ఆహార పదార్ధాలను ఎక్కువగా వాడుట వల్ల మధుమేహము రావటము ప్రారంభం అవుతుంది మరియు ఇన్సులిన్ ఉత్పత్తిలో తేడాలు వస్తాయి. శుద్ధిచేసిన కార్బోహైడ్రేట్లు వాడద్దు : మీ రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించాలి అని అనుకుంటే వైట్ రైస్, పాస్తా, పాప్ కార్న్, బియ్యపు పఫ్స్ మరియు తెలుపు పిండిపదార్థాల వంటి వాటిని వాడటం మానాలి. వీటిని వాడుట వల్ల మధుమేహ సమయంలో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు తగ్గి రక్తంలో చక్కెర అదుపు లేకుండా పెరుగుతుంది. పీచు పదార్దం: పీచు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడం కొరకు చాలా సహాయకారిగా ఉంటుంది. పీచు రక్తంలో చక్కెరను గ్రహించి సాదరణ ఇన్సులిన్ కు సులభతరంగా ఉంటుంది. స్మోకింగ్(ధూమపానం) మానాలి : స్మోకింగ్ అనేది గుండె మరియు రక్తనాళాల ఆరోగ్యం మరియు హార్మోన్ల మీద ప్రబావం చూపిస్తుంది. స్మోకింగ్ వల్ల మధుమేహం రావటానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. స్మోకింగ్ అలవాటు మానటం వల్ల మంచి ఆరోగ్యం మరియు మధుమేహంనకు దూరంగా ఉండవచ్చు. తాజా పండ్లు: అవసరమైన అన్ని విటమిన్లు మరియు ఖనిజాలు అందించడానికి సహజ పండ్లు ఆహార ప్రత్యామ్నాయాలుగా ఉన్నాయి. అలాగే అరటిపండ్లు తినే బదులు సిట్రస్ జాతి పండ్లు తింటే మధుమేహ నియంత్రణకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. తాజా కూరగాయలు: తాజా కూరగాయలలో సమృద్ధిగా ఇనుము, జింక్, పొటాషియం, కాల్షియం మరియు ఇతర అవసరమైన పోషకాలు ఉన్నాయి. ఈ పోషకాలు మొత్తం హృదయం మరియు నరాల ఆరోగ్యంలో సంతులనం మరియు పునరుద్ధరించడానికి సహాయం చేస్తాయి. శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి సంతృప్త స్థాయిలో ఉండేలా చేస్తాయి. గ్రీన్ టీ: ఒక కప్పు గ్రీన్ టీ క్రమం తప్పకుండా తరచుగా త్రాగితే ఫ్రీ రాడికల్స్ శరీరం నుండి తొలగుతాయి. గ్రీన్ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రక్తంలో చక్కెర స్థాయిలను సాధారణ స్థాయిలో ఉండేలా చేస్తాయి. మధుమేహం తగ్గించడంలో చాలా సహాయం చేస్తుంది. కాఫీ: కాఫీ లో ఉండే కెఫీన్ గుండె మరియు రక్తనాళాల ఎన్నో రకముల వ్యాధుల నివారణకు అవకాశాలను కలిగి ఉంది. అయితే, ఒక మధ్యస్థ వినియోగం ద్వారా రక్తంలో చక్కెర స్థాయి పెరుగుదలను నిరోధిస్తుంది. కెఫిన్ శరీరంలో ఉన్న అనవసరమైన క్యాలరీలను తొలగిస్తుంది. దీర్ఘకాలంగా ఉన్న పంటి నొప్పిని తగ్గిస్తుంది. ఇది ఆకలిని కూడా తగ్గిస్తుంది. తక్కువగా,క్రమం తప్పకుండా భోజనం: తక్కువ మొత్తంలో తరచుగా భోజనం చేయుట వల్ల అత్యధిక పోషకాలు మరియు తక్కువ కొవ్వుకు కారణం అని తెలుస్తోంది. కొవ్వు ఏర్పడకుండా, ఇన్సులిన్ ను సాధారణ స్థితికి తీసుకు వస్తుంది. గుండె రక్తనాళాలకు సంబంధించిన ఆరోగ్యం: మధుమేహం ప్రారంభం కాగానే ముందుగా గుండె జబ్బులకు ప్రభావితం అవుతుంది. అందువల్ల మధుమేహం ఉన్నవారు తరచుగా కొలెస్ట్రాల్ స్థాయిలను పరీక్షించటం ఎంతైనా అవసరం ఉంది. రెడ్ మాంసం మానండి : రెడ్ మాంసంను ఎక్కువగా వాడుట వల్ల దానిలో పోలిఫెనోల్స్ అధికంగా కలిగి ఉండి రక్తపు కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది. రెడ్ మాంసంలో క్లిష్టమైన ప్రోటీన్ నిర్మాణాల కారణంగా చాలా నెమ్మదిగా జీర్ణము అవుతాయి. అందువలన, రెడ్ మాంసంను ఎక్కువగా వాడుట వల్ల జీవక్రియ రేటు తగ్గటం మరియు ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఒత్తిడి నిర్వహణ: ఆక్సిటోసిన్ మరియు సెరోటోనిన్ సంతృప్త స్థాయిల్లో ఉంటేనే నరములు పనితీరు బాగుంటుంది. ఒత్తిడి సమయంలో విడుదలయ్యే ఆడ్రినలిన్ ఇన్సులిన్ తయారికి అవరోధం కల్పిస్తుంది. ఒత్తిడికి దూరంగా పనులు నిర్వహించడం వల్ల రక్తంలో అధికంగా ఉన్న చక్కెర స్థాయిలను సమర్ధవంతముగా తగ్గిస్తుంది.




హై ప్రొటీన్ ఆహారం: ఆహారంలో అధిక ప్రొటీన్ శరీరంలో శక్తి స్థాయిలు నిర్వహించడంలో చాలా సహాయకారిగా ఉంటుంది. మధుమేహ ప్రమాదం ఉన్న వ్యక్తులు కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లను మరియు అధిక క్రొవ్వు శాతం ఉన్న ఆహారాలు తగ్గించటం చాల మంచిది.

ఫాస్ట్ ఫుడ్స్ మానుకోండి: ఫాస్ట్ ఫుడ్స్ లో అధిక ఉప్పు, ప్రాసెస్ చేసిన చక్కెరలు మరియు క్లిష్టమైన కార్బోహైడ్రేట్ల నిండి ఉంటాయి. ట్రాన్స్ క్రొవ్వులు-కలిగి ఉన్న అనారోగ్యకరమైన నూనెలు అధికంగా ఉంటాయి. రక్తంలో చక్కర స్థాయిలు ఆరోగ్యకరంగా ఉండాలంటే తప్పనిసరిగా ఫాస్ట్ ఫుడ్స్ ను మానాలి.

రెగ్యులర్ గా చెకప్ చేయించుకోవాలి : రక్తంలోని గ్లూకోజ్ స్థాయిని రెగ్యులర్ గా తెలుసుకోవటం కొరకు ఒక మానిటర్ కొనండి. ఈ పరికరాలు మీ చక్కెర స్థాయిలు నియంత్రణ లేదా నిర్ధారణ కొరకు ఒక చుక్క రక్తం అవసరం అవుతుంది.

రెగ్యులర్ కన్సల్టేషన్: మధుమేహం ఉన్న వారు నిరంతరము మనకుండా చెకప్ చేయించుకోవాలి. ఈ విధమైన సవ్యమైన రోగనిర్ధారణ వల్ల రక్తంలో చక్కర స్థాయిల గురించి తెలుస్తుంది.

మంచి నిద్ర: ప్రతి రాత్రి తక్కువ గంటలు నిద్ర పోయిన వారి కంటే 7-8 గంటల పాటు నిద్ర పోయిన వారికీ మధుమేహం వచ్చే అవకాశాలు చాల తక్కువ అని తేలింది. సరైన నిద్ర ఉండుట వల్ల మెదడు లో హార్మోన్ ల విడుదల నార్మల్ గా ఉంటుంది. నిద్ర లేకపోవడం వల్ల సాధారణ హార్మోన్ల సమతుల్యత ఉండదు.



ఉప్పు తగ్గించండిఫ :తక్కువ ఉప్పు తీసుకోవడం అనేది మధుమేహం నియంత్రించడంలో కీలకమైన అంశం. ఉప్పు ఎక్కువ వాడటం వల్ల శరీరం యొక్క ఆస్మాటిక్ సంతులనం, వివిధ హార్మోన్ల క్రమరాహిత్యాలు పెరిగే అవకాసం ఎక్కువగా ఉంటాయి. ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గి టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం ఉంటుంది.

గాయాలకు కేర్ తీసుకోండి: మధుమేహం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలహీనమై చిన్న గాయాల సులభంగా నయం కావు. ఈ గాయాలు మనకు అధిక రక్తం-చక్కెర స్థాయిలు యొక్క ప్రాధమిక శారీరక సంకేతాలను ఇస్తాయి.

నీరు త్రాగాలి : నీరు త్రాగటం వలన రక్తం లో అధిక చక్కెర కంటెంట్ నివారించడంలో సహాయపడుతుంది.ప్రతి రోజు కనీసం 2.5 లీటర్ల నీరు త్రాగాలి. భౌతిక ప్రక్రియలను నియంత్రిస్తుంది మరియు గుండె మరియు రక్తనాళాల మరియు డయాబెటిక్ వ్యాదులు వచ్చే అవకాశాలు తగ్గుట కనిపిస్తుంది.

లీన్ మాంసం: మధుమేహం ప్రమాద పరిధిలో లీన్ మాంసం శాకాహారులకు గొప్ప ప్రత్యామ్నాయంగా ఉన్నది. శరీర క్షేమము కొరకు ఎక్కువ ప్రోటీన్ అవసరము.

ఎక్కువ కాల్షియం: ఎక్కువ కాల్షియంను ఆహారం రూపంలో గాని,సప్లిమెంట్ రూపంలోగాని తీసుకొంటే మధుమేహం సోకే అవకాశాలను తగ్గించవచ్చు.

వెనిగర్: వెనిగర్ రక్తంలో ఎక్కువ చక్కెర-స్థాయిలను తగ్గించే బాధ్యత గల ఒక అద్భుతమైన ఆహార సమ్మేళనం.

సోయా: సోయ్ ప్రొటీన్ కీలకమైన రోగుల్లో మధుమేహం తగ్గించడానికి కోసం ఆశ్చర్యకరమైన చికిత్సలలో ఒకటి. చాలా తక్కువ కేలరీలు ఉన్నా,కానీ ఇతర ఆహారాలతో పోలిస్తే సోయాలో ఉన్న ఐసోఫ్లావోనెస్ రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించేందుకు సహాయపడుతుంది.

గేస్ పానీయాలు మానాలి : కోలా,ఇతర గేస్ పానీయాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. చక్కెర కంటెంట్ ఎక్కువ ఉండుట వల్ల పోషకాలు తగ్గి శారీరక సామర్థ్యం మీద ప్రబావం ఉంటుంది.

సూర్యకాంతి: సూర్యకాంతిలో ఉండే విటమిన్ ్రా శరీరంలో ఇన్సులిన్ ను నియంత్రిస్తుంది. శారీరక సమన్వయం కూడా బాగా మెరుగుపడుతుంది అని తేలింది. విటమిన్ ్రా లేకపోవుట వల్ల తక్కువ ఇన్సులిన్ ఉత్పత్తి జరుగుతుంది. సూర్యుడుని మధుమేహం స్థాయిలు తగ్గించడానికి ఒక అద్భుతమైన ఇంకా సులభమైన పరిష్కారంగా చెప్పవచ్చు. అంతే కాకుండా చర్మ క్యాన్సర్ ప్రమాదాలు తగ్గుతాయి.

# చిత్రభాను

# రాజా ది గ్రేట్....



## ట్రైలర్ వచ్చిన ఆనందంలో

# భార్యతో డాన్స్...



బాలీవుడ్ స్టార్స్ అందరిలో స్టైల్ అండ్ సెక్సీ మాన్ ఎవరు అంటే ఇప్పుడు చాలా పేర్లు వస్తాయి. కానీ కొన్ని ఏళ్ళు కిందట ఇదే ప్రశ్న వేస్తే ఎక్కువ మంది ఎన్నుకొనేది మాత్రం సంజయ్ దత్ నే. అతని అభిమానులు ముద్దుగా సంజు బాబా అని పిలుచుకుంటారు. చూడానికి కొంచం మొరటోడు మొండోడు లా కనిపించినా అందరితో ప్రేమగా స్నేహానికి ప్రాణం ఇచ్చే మనిషిగా చెప్పుకుంటారు. అలాంటి వాడు కూతురుని ఎలా ప్రేమిస్తాడో మనం ఊహించుకోవచ్చు. భూమి... సంజయ్ దత్ నటించిన బాలీవుడ్ కంబ్యాక్ ఫిల్మ్. జైలు శిక్ష కారణంగా సినిమాలకు దూరమైన సంజయ్ దత్.... శిక్ష ముగిసిన తర్వాత చేస్తున్న తొలి సినిమా. సంజయ్ దత్, అదితి రావు హైదరి ప్రధాన పాత్రలు పోషిస్తున్న 'భూమి' చిత్రానికి ఓమంగ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో సంజయ్, అదితి తండ్రి కూతుళ్లుగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదల చేశారు. గురువారం విడుదలైన సంజయ్ దత్ నటించిన 'భూమి' ట్రైలర్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. విశేషం ఏమంటే అదే రోజున సంజూభాయ్ కుమార్తె త్రిషాలా పుట్టిన రోజు. ట్రైలర్ విడుదల సమయంలో వాయిస్ మెసేజ్ ద్వారా తండ్రితో కలసి తన ఆనందాన్ని పంచుకుంది త్రిషాలా. ఇక అదే రోజు రాత్రి తన కుమార్తె పుట్టిన రోజు పార్టీలో భార్య మాన్యతతో కలసి సూపర్‌గా డాన్స్ చేశాడు సంజయ్ దత్. 'భూమి' ట్రైలర్‌ను మించి ఈ డాన్స్ వీడియో సైతం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయింది.

రవితేజ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న చిత్రం 'రాజా ది గ్రేట్'. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఈచిత్రానికి సంబంధించిన టీజర్ రిలీజ్ చేశారు. టైటిల్ కు తగిన విధంగానే సినిమా చాలా గ్రేట్ గా ఉండబోతోందని టీజర్ చూస్తే స్పష్టమవుతోంది.

వరుస ఫ్లాపులతో కాస్త వెనక పడ్డ రవితేజ, 'బెంగాల్ టైగర్' మూవీ తర్వాత చాలా గ్యాప్ తీసకున్నాడు. రొటీన్ సినిమాలు చేస్తే నొలదొక్కుకోవడం కష్టమని ఊహించి అనిల్ రావిపూడి చెప్పిన విభిన్నమైన స్టోరీకి కమిట్మెంట్ ఇచ్చి త్వరలో 'రాజా ది గ్రేట్' సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. రాజా ది గ్రేట్ సినిమాలో రవితేజ అంధుని పాత్రలో కనిపించబోతున్నాడు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు.... ఆ నయనాల్లేకుండానే పాతికేళ్ల నుండి కుమ్మేత్తున్నాం ఇక్కడ... మిగతా పార్ట్స్ అమ్మేసుకుంటారా? సర్వేంద్రియానం సర్వం ప్రధానం' అంటూ రవితజ చెప్పే డైలాగుతో టీజర్ ప్రారంభమైంది.



# సాయి పల్లవి.. చాలా కూల్..



సాయిపల్లవి, దుల్కర్ సల్మాన్ జంటగా మళయాలంలో చేసిన 'కలి' చిత్రం అక్కడ భారీ విజయం సాధించింది. 'ఒకే బంగారం' సినిమాతో దుల్కర్ సల్మాన్, 'ఫిదా' మూవీతో సాయి పల్లవి తెలుగులో బాగా పాపులర్ కావడంతో వీరిద్దరు నటించిన ఆ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. షార్ట్ టెంపర్ ఉన్న ఓ కుర్రాడుకి, కూల్ గా ఎప్పుడూ నవ్వుతూ ఉండే అమ్మాయికు మధ్య జరిగే ప్రేమకథ 'కలి'. తెలుగులో ఈ చిత్రానికి ఇంకా టైటిల్ ఖరారు కాలేదు. ప్రస్తుతం అనువాద కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ 1న ఆడియో రిలీజ్ చేసి, సెప్టెంబర్ 8వ తేదీన సినిమాను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగులో డివి కృష్ణ స్వామి రిలీజ్ చేస్తున్నారు. ఫిదా' సినిమాలో సాయి పల్లవి పేరు భానుమతి కావడంతో అదే పేరు టైటిల్ లో వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. త్వరలో టైటిల్ ఏమిటనేది ఖరారు కానుంది. సినిమా గురించి డి.వి.కృష్ణ స్వామి మాట్లాడుతూ.... యూత్ కు బాగా కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాం. ఈ సినిమాకు రెండు టైటిల్స్ అనుకుంటున్నాం. పిల్ల-పిల్లగాడు, మైడియర్ భానుమతి. త్వరలో టైటిల్ ఫైనల్ చేసి అనౌన్స్ చేస్తాం. గోపీ సుందర్ సంగీత సారధ్యంలో రూపొందిన రెండు పాటలు తెలుగులోనూ మంచి హిట్ అవుతాయని నమ్మకంతో ఉన్నాం. అన్నారు. ఎగ్జిక్యూటర్ ప్రొడ్యూసర్ దక్షిణ్ శ్రీనివాస్ మాట్లాడుతూ... షార్ట్ టెంపర్ ఉన్న ఓ కుర్రాడుకి, కూల్ గా ఎప్పుడూ నవ్వుతూ ఉండే అమ్మాయికు మధ్య జరిగే ప్రేమకథ. ఇందులో లవ్ ఎపిసోడ్స్ తో పాటు యాక్షన్ కూ చోటు ఉంది. ఈ సినిమాలో వచ్చే నాలుగు ఫైట్స్ కూడా నాలుగు రకాలుగా డిఫరెంట్ గా డిజైన్ చేసారు. ముఖ్యంగా హైవే మీద వచ్చే లారీ ఛేజ్ ప్రేక్షకులను థ్రిల్ కు గురి చేస్తుంది. కామెడీ సీన్స్ కూడా సినిమాలో హైలెట్ అవుతాయి అన్నారు. ఈ చిత్రానికి మాట్లుః భాష్య శ్రీ, సాహిత్యంః సురేంద్ర కృష్ణ, భాష్య శ్రీ, సంగీతంః గోపీసుంద్ర్, సినిమాటోగ్రీః గిరీష్ గంగాధ్రన్, ఫైట్స్: రాజశేఖర్, జాలీ బాస్టియన్, పీఆర్వో : బియాండ్ మీడియా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూస్రః దక్షిణ్ శ్రీనివాస్, కో ప్రొడ్యూస్రః వి.చంద్రేఖ్ర, నిర్మాతః డి.వి.కృష్ణ్ణామి, ద్ర్శ్కుంః స్మీర్ తాహిర్.

# ఆకలితో వున్నవాడికి అన్నం పెట్టడం కూడా దేశభక్తే!

# యాక్షన్‌కింగ్ అర్జున్



**యాక్షన్‌కింగ్‌గా దక్షిణాది చిత్రసీమలో ప్రసిద్ధుడు సీనియర్ హీరో అర్జున్. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ కెరీర్ ఆయనది. యాక్షన్‌తో పాటు కుటుంబకథా చిత్రాల హీరోగా తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ ఆయన్ని విలక్షణ కథానాయకుడిగా నిలిపాయి. యాభయ్యేవపడిలో కూడా నవ యువకుడిగా దర్శనమిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారాయన. అర్జున్ ప్రతినాయకుడి పాత్రలో నటించిన లై చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో తన మనోభావాల్ని పంచుకున్నారు. ఆ ముచ్చట్లివి..**

**తెలుగులో తొలిసారి విలన్ పాత్రలో నటించారు. హీరోగా అవకాశాలొస్తున్నా ప్రతినాయకుడి పాత్రను అంగీకరించడానికి కారణమేమిటి?**

మా పల్లెలో గోపాలుడు (1984) చిత్రం ద్వారా తెలుగులో నేను సినీరంగ ప్రవేశం చేశాను. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో 150 సినిమాలు చేశాను. నటుడిగా ఇంత అనుభవం వుంది కాబట్టి కొత్తగా ఏదైనా ప్రయత్నిస్తే బాగుంటుందనిపించింది. నట జీవితంలో ఓ దశకు చేరుకున్నాకే మనం అనుకున్న పాత్రల్ని, ప్రయోగాల్ని చేయగలుగుతాం. రొటీన్‌కు భిన్నంగా నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రతినాయకుడి పాత్రలో నటించాను.

**లై చిత్రంలో విలన్‌గా నటించడం వల్ల హీరోగా మీ ఇమేజ్‌కు భంగం కలుగుతుందని భయపడలేదా...?**

అలాంటిదేమి లేదు. వాస్తవానికి హీరోకు కొన్ని పరిధులు వుంటాయి. అదే విలన్ పాత్రలో అయితే మనలోని ప్రతిభను అన్ని కోణాల్లో ప్రదర్శించే అవకాశం దొరుకుతుంది. ఈ సంవత్సరం హీరోతో పాటు విలన్ పాత్రలు వస్తున్నాయి. ఇలాంటి అవకాశాలు రావడం దేవుడిచ్చిన బహుమతిగా భావిస్తున్నాను. అందుకే హీరో, విలన్‌గా రెండు రకాల పాత్రల్ని అంగీకరిస్తున్నాను.

**సినిమాలో మీరు పోషించిన పాత్రకు ఎలాంటి స్పందన లభిస్తున్నది...?**

నా పాత్ర చిత్రణలో భిన్న పార్శ్వాలు వుండటం ప్రేక్షకులకు కొత్తగా అనిపిస్తున్నది. హీరోగా నటించిన సినిమాలకు ఎలాంటి ప్రశంసలు లభిస్తాయో ఈ చిత్రానికి కూడా అదే స్థాయిలో స్పందన లభిస్తున్నది. ప్రాణంపెట్టి చేస్తే ఏ సినిమానైనా ప్రేక్షకులు ఆదరిస్తారని తెలిసింది.

**అర్జున్ అంటే ఫిట్‌నెస్ గుర్తుకొస్తుంది. యాభైయేళ్ల పడిలో కూడా ఇంకా యువకుడిగానే కనిపిస్తున్నారు. మీ ఫిట్‌నెస్ రహస్యమేమిటి?**

ప్రేక్షకులు తిడతారేమోననే భయమే నేను ఫిట్‌గా వుండటానికి కారణం అనుకుంటున్నాను. మనకున్న ప్రజాదరణను కాపాడుకుంటూ మంచి సినిమాలు చేయాలంటే తప్పకుండా కష్టపడాలి. శారీరకంగా దృఢంగా కనిపించాలి. ప్రతి ఒక్కరు స్వయంస్ఫూర్తితో చక్కటి శారీరక, మానసిక శక్తుల్ని పొందడానికి శ్రమించాలి. అవన్నీ పాటించడం వల్లే నేను ఇప్పటికీ ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నాను.

**మీ సమకాలీన హీరోలు రాజకీయరంగంపై దృష్టిపెడుతున్నారు. భవిష్యత్తులో మీరు పాలిటిక్స్‌లోకి వచ్చే ఆలోచన వుందా?**

ఓ మంచి రాజకీయ నాయకుడిగా రాణించాలన్నా, చెడ్డ రాజకీయ నాయకుడు అనిపించుకోవాలన్నా... అందుకు ఎన్నో తెలివితేటలు అవసరం. సినిమాల్లో సక్సెస్ అయినంత మాత్రాన రాజకీయాల్లో రాణిస్తామనే రూలేం లేదు. నా దృష్టిలో సినిమా ద్వారా కూడా సమాజ సేవ చేయొచ్చు. విద్య అవశ్యకతను తెలియజేస్తూ నేను నటించిన ఓ కన్నడ చిత్రానికి ఆ రాష్ట్ర ప్రభుత్వ అవార్డ్ లభించింది. ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి సినిమాలు కూడా సమాజ సేవ క్రిందకే వస్తాయని నా అభిప్రాయం.

**భవిష్యత్తులో కూడా ప్రతినాయకుడి పాత్రలో నటించే ఆలోచన వుందా?**

సృజనాత్మకంగా ఆలోచిస్తూ కొత్త ప్రయత్నాలు చేసినప్పుడే నటుడిగా నిలదొక్కుకుంటాం. నా మనసుకు నచ్చిన పాత్రలు లభిస్తే విలన్ పాత్రల్లో నటించడానికి సిద్ధంగా వున్నాను.

**సినిమాల ఎంపికలో మీరు చాలా జాగ్రత్తలు తీసుకుంటారని చెబుతుంటారు..?**

అవును. దక్షిణాది నుంచి ఎన్నో ఆఫర్లు వస్తుంటాయి. పెద్ద హీరోలు, అగ్ర నిర్మాణ సంస్థలు తమ సినిమాల్లో నటించమని అడుగుతుంటారు. అయితే బంగారు కత్తి అని చెప్పి మెడ కోసుకోలేం కదా? ఎంతటి సంస్థ అయినా కథ నచ్చితేనే నేను సినిమాకు అంగీకరిస్తాను. కథాంశాల్లో, నా పాత్ర రూపకల్పనలో నవ్యత వుంటేనే సినిమాల్ని ఒప్పుకుంటాను.

**ఆ రోజు భయంతో నిద్రపోలేదు!**

ఫలితాన్ని గురించి ఆలోచించకుండా కొత్తదనాన్ని నమ్మి ఈ సినిమా చేశాం. రొటీన్ కామెడీ ట్రాక్‌లు, ఆరు పాటలు, ఫైట్లు లేకుండా కథకు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చి మేము చేసిన ఈ ప్రయత్నానికి చక్కటి స్పందన లభిస్తున్నది అని అన్నారు నితిన్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం లై. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో చిత్రబృందం థాంక్స్ మీట్‌ను నిర్వహించారు. నితిన్ మాట్లాడుతూ అ ఆ తర్వాత ప్రేమకథతో సేఫ్‌గేమ్ ఆడొచ్చు. కానీ కొత్తదారిలో వెళ్లడమే ఉత్తమమనే ఆలోచనతో లై సినిమాను ఎంచుకున్నాను. విభిన్నమైన కథ కావడంతో ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారో అనే భయంతో విడుదలకు ముందు రోజు రాత్రి నిద్రపట్టలేదు. తొలి రోజు సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. కానీ రోజు రోజుకు సినిమా పట్ల అభిప్రాయం మారుతూ వస్తున్నది. మంచి సినిమా చేశామని అందరూ చెబుతుండటం ఆనందంగా ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జున్, హను రాఘవపూడి, మేఘాఆకాష్, యువరాజ్ పాల్గొన్నారు.

**మీ అమ్మాయిని కన్నడ చిత్రసీమకు పరిచయం చేస్తూ స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఆ చిత్ర విశేషాలేమిటి...?**

కాదలిన్ పొన్ వీదియిల్ పేరుతో తమిళ, కన్నడ భాషల్లో ఆ సినిమా చేస్తున్నాను. హృద్యమైన ప్రేమకథా చిత్రమది. మా అమ్మాయి సినిమాల్లోకి వస్తానని చెప్పినప్పుడు నేను అభ్యంతరం చెప్పలేదు. 35ఏళ్లుగా పరిశ్రమలో వుంటున్న నేనే నా కూతురిని సినిమాల్లోకి వెళ్లొద్దంటే ఇక సామాన్య ప్రజలు ఏమనుకుంటారు? అందుకే తనను వద్దనలేదు. ఆమె ఇష్టాన్ని గౌరవించి సినిమాల్లో ప్రోత్సహిస్తున్నాను. ప్రతిరంగంలో మంచి చెడులుంటాయి. కాబట్టి ఫలానా రంగంలోకి వెళ్లొద్దనే ఆలోచన తప్పు.

**మీలో దేశభక్తి ఎక్కువని అంటుంటారు. దేశభక్తి ప్రధాన చిత్రాల్ని కూడా ఎక్కువ చేశారు...?**

మా నాన్నకు దేశభక్తి ఎక్కువ. నాకది వారసత్వంగా వచ్చిందనుకుంటాను. మనం ఏదైనా పనిచేస్తే దాని నుంచి మనం ఏమైనా నేర్చుకోవాలి..లేదా సమాజానికేమైనా చెప్పాలి అని మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు. ఆయన ఆలోచనలే నాలోని దేశభక్తికి ప్రేరణనిచ్చాయి.

**దేశభక్తికి మీరిచ్చే నిర్వచనమేమిటి...?**

దేశభక్తికి విస్తృత పరిధి వుంటుంది. ఏవో కొన్ని పనులనే దేశభక్తికి తార్కాణంగా భావించవొద్దు. మన ఇల్లు బాగుండాలని ఎలా అనుకుంటామో..అందరి ఇల్లు అలాగే బాగుండాలని కోరుకోవడం దేశభక్తి. కష్టాల్లో వున్నవారికి చేయూతనివ్వడం దేశభక్తి. ఆకలితో వున్నవాడికి ఓ పూట భోజనం పెట్టడం దేశభక్తే. ఇలా ఏదో రూపంలో సమాజానికి మేలు చేయడమే నా దృష్టిలో నిజమైన దేశభక్తి.

**సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది. ఏ విషయంలోనైనా అసంతృప్తికి గురైన సందర్భాలున్నాయా?**

ఇప్పటికి రోజూ నాలుగైదు సినిమా అవకాశాలొస్తున్నాయి. ఇది దేవుడిచ్చిన వరం అనుకుంటున్నాను. ఒక సినిమా విజయానికి కేవలం హీరో కారణం అంటే నేను నమ్మను. సినిమా సక్సెస్‌కు కాంబినేషన్‌లు, దర్శకుడు, టెక్నీషియన్ల పనితనం, విడుదల సమయం..ఇలా ఎన్నో అంశాలు కారణమవుతాయి. నావల్లే సినిమా హిట్ అయిందని ఎవరైనా చెబితే అంతకుమించి మూర్ఖత్వం వుండదు. సినిమా ఓ సమిష్టి బాధ్యత. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ విజయాలు దక్కడం పట్ల నేను ఆనందంగా వున్నాను. దక్షిణాది ప్రేక్షకులు నాపై చక్కటి ఆదరణ కనబరుస్తున్నారు. వారి ప్రేమాభిమానాల్ని కాపాడుకుంటూ కెరీర్‌లో మరింతగా రాణించాలని కృషిచేస్తున్నాను.

# స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

## మోడీకి ట్రంప్ ఫోన్



న్యూఢిల్లీ: భారత 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. సోమవారం సాయంత్రం ప్రధాని నరేంద్ర మోడీకి ఫోన్ చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ విషయాన్ని ప్రధాని మోడీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆయనకు ధన్యవాదాలు తెలుపుతూ అభినందించారు. కాగా, ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన మోడీ.. ట్రంప్‌తో పలు అంశాలపై చర్చించిన సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య సత్సంబంధాలను పెంచేందుకు ఇరువురు నేతలు పలు నిర్ణయాలు కూడా తీసుకున్నారు. అంతేగాక, ఈ నవంబర్‌లో హైదరాబాద్‌లో జరగబోయే అంతర్జాతీయ వాణిజ్య సదస్సుకు ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరవనున్నారు. ఇవాంకా ట్రంప్ రాక కోసం తాను ఎదురుచూస్తున్నానని మోడీ కొద్ది రోజుల క్రితం ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. ట్రంప్, ఇవాంకా కూడా హైదరాబాద్ పర్యటనపై ట్విట్టర్ వేదికగా స్పందించారు.

# ప్రాణం తీసిన వేగం..

## మాజీ ఎమ్మెల్యే కుమారుడు సహా ఇద్దరు మృతి



నల్గొండ: జిల్లాలోని కట్టంగూర్ మండలం ఎర్రసానిగూడెం స్టేజీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ కుమారుడు సహా ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కొత్తగూడెం నుంచి జడ్చర్ల వె%పు ప్రయాణిస్తున్న కారు ముందు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న భద్రాద్రి- కొత్తగూడేనికి చెందిన వె%ద్యుడు మద్దికాయల విజయ్‌కుమార్ (55), ఆయన అత్త సావిత్రి భాయి (78) అక్కడికక్కడే మృతిచెందారు. విజయ్‌కుమార్ భార్య, వె%ద్యురాలు ఝాన్సీ (55), మరో యువతి శోభ (18) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఝాన్సీ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి తరలించారు.జడ్చర్లలో ఓ శుభ కార్యానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వెళ్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. మృతదేహాలను నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నివాసాలపై మృత్యుపాశాలు



హైదరాబాద్‌: పేరుకు నగరంలో సొంతిల్లు.. బస్తీల్లో మేడ మీదికి ఎక్కి బట్టలు ఆరేసుకునే భాగ్యం కూడా లేని పరిస్థితి. కనీసం చేతులు కూడా పైకెత్తలేరు.. పొరపాటున చేయి ఎత్తారో ప్రాణాల మీద ఆశలు వదలుకోవాల్సిందే. నగరంలోని చాలా బస్తీల్లో ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు యమపాశాల్లా వేలాడుతున్నాయి. హైదరాబాద్ నగరాభివృద్ధిపై తాజాగా ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలను నివాసాల మీద నుంచి తొలగించాలని మరోసారి ఆదేశించారు. 2015లోనూ సీఎం ఆదేశించినా ఇప్పటివరకు డిస్కం అధికారులు తొలగించలేదు.

**కనీసం ఈసారైనా తొలగేనా?**

బస్తీవాసులు, కాలనీ వాసులు ఎన్నో ఏళ్లుగా తీగలు తొలగించాలని విద్యుత్తు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తీసుకొచ్చినా.. మంత్రుల సిఫారసులతో కార్పొరేట్ కార్యాలయాన్నే సంప్రదిస్తున్నా ఎలాంటి చొరవ లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన ఒకటి రెండు ప్రాంతాల్లో మాత్రమే నివాసాలపై నుంచి తీగలు తొలగించారు.

జనావాసాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలకు సంబంధించి గ్రేటర్‌లో దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎం ఆదేశాలతో 2015లో ఒక నివేదిక రూపొందించింది. స్వచ్ఛ హైదరాబాద్ కమిటీ సూచన మేరకు నియోజవర్గాల వారీగా తొలగించాల్సిన లైన్లను అయ్యే వ్యయంతో అంచనాలు రూపొందించారు. పలు దఫాలు ప్రజాప్రతినిధులతో సమావేశాల అనంతరం మొత్తంగా గ్రేటర్‌లో ప్రమాదకర తీగల మార్పిడికి రూ.280 కోట్లు కావాలని డిస్కం ప్రభుత్వానికి అప్పట్లో నివేదిక ఇచ్చింది. సర్కారు నుంచి నిధులు రాలేదని పనులను ప్రారంభించలేదు. సీఎం ఆదేశించారని

ఎన్‌బీటీనగర్, పాటిగడ్డ మార్గంలో ప్రమాదకర తీగలను తొలగించారు. ఈ రెండు పనులకే దాదాపు రూ.10కోట్ల వరకు వ్యయం అయినట్లు డిస్కం చెబుతోంది. నగరంలోని ఇంకా 200 బస్తీల్లో ఇదే సమస్య ఉంది. పెద్ద తీగలకు సమీపంలో పదివేల ఇళ్ల వరకు ఉన్నట్లు అధికార్లు గుర్తించారు.

**ఆర్‌ఆర్‌లోనూ ఉన్నాయి..**

శివార్లలోనూ కొన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం పది చోట్ల కరెంట్ తీగల సమస్యలు ఉన్నాయి. వీటి తొలగింపునకు రూ.110 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ రెండేళ్లలో అక్కడక్కడ కొన్ని చిన్న పనులు మాత్రమే అధికారులు చేపట్టారు.

**మెట్రోజోన్‌లో అధికం..**

గ్రేటర్‌లో విద్యుత్తు పంపిణీ పరంగా హైదరాబాద్ నార్త్, సౌత్, సెంట్రల్ సర్కిళ్లు మెట్రోజోన్ పరిధిలోకి వస్తాయి. ఇక్కడే అత్యధిక లైన్లు మార్చాల్సి ఉంది. సుమారు రూ.170 కోట్ల వరకు అవుతున్నట్లు ఇప్పటివరకు గుర్తించిన లైన్లను బట్టి అంచనా వేశారు. వీటిలోనూ అధికంగా మార్చాల్సిన లైన్లు పాతబస్తీలో ఉన్నాయి. ఎన్నో ఏళ్ల కిందట మొదట లైన్లు వేశారు. నగరం అభివృద్ధి చెందుతుండడంతో క్రమంగా లైన్ల కింద బస్తీలు వెలిశాయి. కొన్నిచోట్ల చిన్నరోడ్లు ఉండటంతో తీగలు ఇళ్లపక్కనుంచే వెళుతున్నాయి. 15 నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలోనే ఈ తరహా లైన్లు ఉన్నాయి. హెచ్‌టీ, 33కేవీ కంటే 11కేవీ ఎక్కువగా మార్చాల్సి ఉన్నట్లు ఇంజినీర్లు చెబుతున్నారు.

# క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



కాచిగూడ: దక్షిణ కొరియాలో జరుగనున్న ఆసియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన మహమ్మద్ అన్వర్‌ను రాష్ట్ర క్రీడల మంత్రి పద్మారావు సన్మానించి అభినందించారు.

ఈ నెల 20 నుంచి 26 వరకు దక్షిణ కొరియాలో జరుగనున్న పోటీలకు 70 కిలోల విభాగంలో ఎంపికైన మహమ్మద్ అన్వర్‌ను నగరంలోని చప్పల్‌బజార్‌లోని తెరాస కాచిగూడ డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వర్ణ పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు.

కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎక్కాల కన్నా, కోచ్ సంతోష్‌కుమార్, రయీస్, అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వె%కుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు పడుతున్నట్లు తితిదే అధికారులు చెబుతున్నారు.




# శుద్ధ జలం కలుషితం కాకుండా చర్యలు



కరీంనగర్: నగరానికి సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.శశాంక అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ శశాంక మాట్లాడుతూ.. రిజర్వాయర్ల వారీగా అన్ని ట్యాంకులు శుభ్రంగా కడిగి నివేదిక ఇవ్వాలని ఏఈ, డీఈలకు ఆదేశాలు జారీ చేశామని, ఫిల్టర్‌బెడ్‌లో క్లోరినేషన్ మోతాదు పెంచాలని, అన్ని లీకేజీల మరమ్మతులు వెంటనే చేపట్టాలని సూచించారు. జ్యోతినగర్, అంబేడ్కర్‌నగర్, భగత్‌నగర్ రిజర్వాయర్లను శుభ్రంగా కడిగించడం జరిగిందన్నారు. మిగతా రిజర్వాయర్లనూ శుభ్రం చేయాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, ఎప్పటికప్పుడు ట్యాంకుల వారీగా తాగునీటిని పరిశీలించి శుద్ధ జలం సరఫరా అవుతుందో లేదో గుర్తించాలన్నారు. రంగుమారినా, తోక పురుగులు వచ్చినట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే ఆ ప్రాంతంలో తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని తెలుసుకొని అప్పటికప్పుడు ఆదేశాలిస్తామన్నారు.

**బయటపడుతున్న లోపాలు :**

నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు, పబ్లిక్ నల్లాల దగ్గర లీకేజీలు ఉన్నట్లు సిబ్బంది గుర్తించారు. కిసాన్‌నగర్ ప్రాంతంలో పలు చోట్ల నల్లాలు భూమి లోపల ఉన్నాయని, దీంతో మురుగునీరు అందులోకి వెళ్తొందని క్షేత్రస్థాయి అధికారి ఒకరు తెలిపారు. బాలకృష్ణ థియేటర్ దగ్గర పైపులైను సక్రమంగా మూసివేయకపోవడంతో లీకేజీ జరిగిందని, అందులోకి మురుగునీరు వెళ్తొందన్నారు. వీటన్నింటికీ మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు. వీటితో పాటు ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్న పైపులైన్లను సక్రమంగా మూసివేయలేదు. నీరు కలుషితం కావడానికి ఇదీ కారణమే..




# విరాట్ మరో రికార్డు..



పల్లెకెలె: ఇప్పటికే ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకున్న భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి.. లంకేయులతో టెస్టు సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం ద్వారా మరో ఘనతను సాధించాడు. శ్రీలంకతో చివరిదైన మూడో టెస్టులో భారత్ ఘన విజయం సాధించిన తరువాత కోహ్లి ఖాతాలో మరో రికార్డు చేరింది. విదేశాల్లో అత్యధిక టెస్టు విజయాలు సాధించిన రెండో భారత క్రికెట్ కెప్టెన్‌గా కోహ్లి నిలిచాడు. శ్రీలంకపై విజయం భారత కెప్టెన్ గా కోహ్లికి ఏడో విదేశీ టెస్టు విజయం. అయితే ఇక్కడ భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనిని కోహ్లి అధిగమించాడు.

గతంలో ధోని ఆరు విదేశీ టెస్టు విజయాల్ని సాధించగా, ఆ రికార్డును విరాట్ సవరించాడు. కాగా, విదేశాల్లో అత్యధిక టెస్టు విజయాలు సాధించిన భారత కెప్టెన్ ఘనత సౌరవ్ గంగూలీ పేరిట ఉంది. సౌరవ్ గంగూలీ తన కెరీర్ లో 11 విదేశీ టెస్టు విజయాల్ని సాధించాడు. భారత కెప్టెన్‌గా గంగూలీ 49 టెస్టులకు సారథ్యం వహించగా, ధోని 60 టెస్టులకు కెప్టెన్ గా చేశాడు. కోహ్లి ఇప్పటివరకూ 29 టెస్టులకు సారథిగా చేశాడు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com